జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || మంగళవారం 15, అక్టోబర్ 2024 || ఎడిటర్ : మార్తి సుబ్రహ్మణ్యం

## డీవోపీటీ ఉత్తర్వులు రద్దు చేయండి

- క్యాట్‌ను ఆశ్రయించిన ఆమ్రపాలి, వాకాటి కరుణ, వాణీప్రసాద్, సృజన



హైదరాబాద్, మహానాడు: తనను తెలంగాణలోనే కొనసాగించాలని, డీవోపీటీ ఉత్తర్వులు రద్దు చేయాలని కోరుతూ ఐఏఎస్ ఆమ్రపాలి క్యాట్‌ను ఆశ్రయించారు. ఆమ్రపాలితో పాటు మరో ముగ్గురు అధికారులు క్యాట్‌ను ఆశ్రయించారు.

తెలంగాణలో పని చేస్తున్న ముగ్గురు ఐఏఎస్ అధికారులు ఆమ్రపాలి, వాకాటి కరుణ, వాణీప్రసాద్, ఏపీలో పని చేస్తున్న సృజన క్యాట్‌ను ఆశ్రయించారు. తమను తెలంగాణలో కొనసాగేలా ఉత్తర్వులు జారీ చేయాలని ఆమ్రపాలి, వాకాటి కరుణ, వాణీ ప్రసాద్.. ఏపీలో కొనసాగేలా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని సృజన వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. వారి పిటిషన్లపై కేంద్ర పరిపాలన ట్రిబ్యునల్ మంగళవారం విచారణ చేపట్టనుంది.

జాన్తా నై!

# జగన్‌కు కోటరీ ఝలక్





- కోటరీ ఉచ్చులో జగన్
- వైసీపీలో ఆ ముగ్గురు చెప్పిందే వేదం ● చక్రం తిప్పుతున్న కోటరీ
- సజ్జల, అప్పిరెడ్డి, రఘురామ్‌దేహవా
- కోటరీ దెబ్బకు పార్టీ నుంచి బయటకు వెళ్లిన బాలినేని, మోపిదేవి
- విజయసాయిరెడ్డినీ పక్కనపెట్టించిన సజ్జల?
- ఢిల్లీ, హైదరాబాద్‌కే పరిమితమైన విజయసాయిరెడ్డి
- జగన్ చెప్పినా దక్కని అధ్యక్ష పదవులు ● జగన్ ఆదేశాలు బేఖాతర్
- జిల్లా అధ్యక్షుల్లో కోటరీదే పైచేయి ● కోటరీని మెప్పించిన వారికే పదవులు
- కోటరీపై నేతల కన్నెర్ర ● సజ్జలపై సీనియర్ల సలసల
- పార్టీని పుట్టిముంచుతున్నారంటూ రుసరుస
- కౌన్సిలర్లుగా కూడా గెలవలేని వాళ్లు మాపై పెత్తనం చేస్తున్నారంటూ ఆగ్రహం



(మార్తి సుబ్రహ్మణ్యం)

వైసీపీలో ఆ పార్టీ అధినేత జగన్ చెప్పిందే వేదం అనుకుంటారు. ఆయన మాట శిలాశాసనం అని భావిస్తారు. జగనన్న చెబితే అయిపోతుందను కుంటారు. కానీ అదంతా ఉత్తిదే. ఇప్పుడు పార్టీలో ఆ ముగ్గురూ ఎంత చెబితే అంత! వారు చెప్పిందే వేదం. చేసిందే శాసనం!! మరి జగన్ ఏం చేస్తున్నారు? విజయవాడ టు బెంగళూరుటీ బెంగళూరు టు విజయవాడ షటిల్ సర్వీసులు చేస్తుంటారు. మధ్యలో ఏదైనా చావులొస్తే వెళ్లి 'ఓదార్పు'యాత్రలు చేస్తుంటారు. ఆ ముగ్గురు చెప్పింది చేస్తుంటారు. ఎవరూ తనను పార్టీ ఖర్చులకు డబ్బులు అడక్కపోతే చాలు. ఇప్పుడు వైసీపీలో జగన్ పాత్ర అంతే! జగన్ ఒక నాయకుడిని పిలిచి 'నువ్వే ఫలానా జిల్లా అధ్యక్షుడివి. అందరినీ సమన్వయం చేసుకుని పనిచేసుకో'మని చెప్పడమే కాకుండా, పీఏని పిలిచి ఈ అన్న పేరు సాయంత్రానికి అనౌన్స్ చేయమని ఆదేశించారనుకోండి. అది గంటల్లో జరిగిపోతుందని కదా అందరి భావన?!

బట్ ఇప్పుడు పార్టీలో సీను మారింది. జగన్ చెప్పినా జాన్తానై అంటున్నారు ఆ ముగ్గురు నాయకులు! జగనన్న చెప్పిన పేరుకు భిన్నంగా, మరొకరిపేరు పత్రికల్లో వస్తున్న వైచిత్రి. ఏంటీ.. నమ్మడం లేదా? అంతలావు జగనన్న ఏంటీ.. ఆఫ్టరాల్ ఆ ముగ్గురి మాటలు వినడమేమిటని ఆశ్చర్యపోతున్నారా? బహుబలి జగన్ కోటరీ ఉచ్చులో చిక్కుకోవడతమేమిటని హాశ్చర్యపోతున్నారా?

అవును. ఐదేళ్లు తన కత్తికి ఎదురులేకుండా పార్టీ-ప్రభుత్వాన్ని శాసించి-శ్వాసించిన జగన్, ఇప్పుడు వైసీపీలో కోటరీకి బందీయేనట. ఆయన చెప్పిందేమీ చెల్లుబాటు కావడం లేదట. అందుకు బాపట్ల జిల్లా అధ్యక్ష పదవే ఉదాహరణ అని పార్టీవర్గాలు చెబుతున్నాయి. బాపట్ల జిల్లా పార్టీ అధ్యక్షుడిగా ఎవరిని నియమించాలన్న చర్చ జగన్ సమక్షంలో జరిగింది. ఆ భేటీకి జిల్లా నేతలంతా హాజరయ్యారు.

ఆ సందర్భంగా.. బాపట్ల జిల్లాలో రెండు ఎస్సీ నియోజక వర్గాలు, ఒక పార్లమెంటు ఉన్నందున, అగ్రకులానికి చెందిన వారికి జిల్లా అధ్యక్ష పదవి ఇస్తే బాగుంటుందని, వేమూరు అభ్యర్ధి అశోక్‌బాబు పార్టీ అధినేత జగన్‌కు సూచించారట. ఆ ప్రతిపాదన నచ్చిన జగన్, మరుసటి రోజు మాజీ ఎమ్మెల్యే కరణం బలరాం-ఆయన తనయుడు వెంకటేష్, గాదె మిగతా.. 2లో

- ప్రజలతో... ప్రజలచే... ప్రజల కోసం చేస్తున్న గొప్ప అభివృద్ధి పండుగ
- 30 వేల పనులు, రూ.4,500 కోట్ల నిధులతో ముందడుగు
- సంక్రాంతి నాటికి పనులు పూర్తయ్యేలా ప్రణాళిక
- అన్ని శాఖల సమన్వయంతో పనులు జరగాలి
- అధికార యంత్రాంగం బాధ్యతగా మెలగాలి
- గత ప్రభుత్వ హయాంలో పంచాయతీరాజ్ మంత్రి ఎవరో కూడా తెలియని దౌర్భాగ్యం
- నిధుల మళ్లింపు ఎలా, ఎక్కడికి చేశారన్నది బ్రహ్మ పదార్థం అయిపోయింది
- ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరిపాలన అనుభవం రాష్ట్రానికి వరం
- మోదీ దిశానిర్దేశం, కేంద్ర సాయంతో రాష్ట్రాభివృద్ధికి ముందడుగు
- కంకిపాడు పల్లెపండుగలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసి, ప్రసంగించిన ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి పవన్ కల్యాణ్

పల్లె పండుగలో ప్రతి ఒక్కరి

## భాగస్వామ్యం కావాలి



కంకిపాడు, మహానాడు: రాజకీయాల్లో ప్రజల మన్ననలు పొందడం, వారి కోసం పాలకులతో పోరాడటం సులభమే కావొచ్చు. పరిపాలన చేతికొచ్చాక ప్రజల అభిమానం చూరగొనడం, వారి సంక్షేమాన్ని, అభివృద్ధిని జాగ్రత్తగా ముందుకు నడిపించడంలోనే అసలైన నాయకత్వం దాగుంటుంది. గ్రామగ్రామాన నేటి నుంచి వారం రోజులపాటు సాగే పల్లె పండుగ కార్యక్రమం ఇంత నిండుగా జరుగుతుంటే మదిలో ఆనందంగా ఉంది. ఎన్నికల ముందు కూటమి జట్టుగా ముందుకు వెళితేనే రాష్ట్రాభివృద్ధి పరుగులు తీస్తుందని మిగతా.. 2లో

- అందుకు అనుగుణంగా పారిశ్రామిక పాలసీలు
- స్పీడ్ ఆఫ్ డూయింట్ బిజినెస్ నినాదాన్ని ఆవిష్కరించేలా కొత్త పాలసీలు
- అమరావతిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్
- ఎంఎస్ఎంఈ, ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మహిళా వ్యాపారవేత్తలకు అదనంగా 5 శాతం ఇన్సెంటివ్
- వచ్చే క్యాబినెట్ ముందుకు కొత్త పాలసీలు
- పారిశ్రామిక అభివృద్ధి, ఎంఎస్ఎంఈ, ఫుడ్ ప్రాసెసింగ్ డ్రాఫ్ట్ పాలసీలపై అధికారులతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సమీక్ష



## ఉద్యోగ కల్పనే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం!

అమరావతి, మహానాడు: ఉద్యోగ కల్పనే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. అందుకు అనుగుణంగా పారిశ్రామిక పాలసీలు ఉండాలని ఆయన అభిప్రాయ పడ్డారు. పారిశ్రామిక వేత్తలను, పెట్టుబడుదారులను ఆకర్షించి.... స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ కు మార్గం సుగమం చేసేలా నూతన పాలసీలు ఉండాలని చంద్రబాబు అన్నారు. సచివాలయంలో ఇండస్ట్రియల్ డెవలప్మెంట్, ఎంఎస్ఎంఈ, ఫుడ్ ప్రాసెసింగ్, ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్క్ డ్రాఫ్ట్ పాలసీలపై అధికారులతో ముఖ్యమంత్రి సమీక్ష జరిపారు. ప్రైవేటు ఇండస్ట్రియల్ పార్క్ పాలసీపై మరికొంత కసరత్తు జరగాలని ముఖ్యమంత్రి సూచించారు. మిగిలిన మూడు పాలసీలను వచ్చే క్యాబినెట్ ముందుకు తీసుకువచ్చేందుకు ఈ సందర్భంగా నిర్ణయించారు. నూతన పాలసీతో రాష్ట్రంలో పెద్ద ఎత్తున పెట్టుబడులు తెచ్చేందుకు ఆస్కారం మిగతా.. 7లో



02

ఏపీ,తెలంగాణ రోడ్లకు మహర్దశ



03

లిక్కర్ మాఫియాకు, సిండికేట్లకు అడ్డాగా ఆంధ్రప్రదేశ్



02

గంగానదికి ఒక న్యాయం... మూసీకి ఒక న్యాయమా?

## పరిశ్రమల స్థాపనకు ఆంధ్రాలో సూపర్ ఛాన్స్!

- స్టార్టప్ ఆంధ్ర నినాదం మాత్రమే కాదు... పాలనా విధానాన్ని మార్చే ఆయుధం
- వరదల సమయంలో స్టార్టప్‌ల సహకారం భేష్
- ప్రైవేటురంగ సహకారం తీసుకుంటాం
- 20 లక్షల ఉద్యోగాల లక్ష్యాన్ని సాధించి తీరుతాం
- యుఎస్-ఇండియా ఫోరం లీడర్ షిప్ సమ్మిట్‌లో రాష్ట్ర విద్య, ఐటి శాఖల మంత్రి లోకేష్



న్యూఢిల్లీ,మహానాడు: పరిశ్రమల స్థాపనకు భారత్‌లో మరే రాష్ట్రంలో లేనివిధంగా ఆంధ్రప్రదేశ్‌లో అనువైన వాతావరణాన్ని కల్పించి, ప్రోత్సహకాలు అందజేస్తామని రాష్ట్ర విద్య, ఐటి, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. న్యూఢిల్లీలోని తాజ్ మహల్ హోటల్ లో జరిగిన యుఎస్ ఇండియా స్ట్రాటజిక్ పార్టనర్ షిప్ ఫోరం లీడర్ షిప్ సమ్మిట్ లో మంత్రి లోకేష్ పాల్గొన్నారు. ఈ సదస్సుకు ఫోరమ్ చైర్మన్, జెసి 2 వెంచర్స్ వ్యవస్థాపకుడు జాన్ ఛాంబర్స్ అధ్యక్షత వహించారు. ఫైర్ సైడ్ సంభాషణలో ఆపిల్ ఇండియా మేనేజింగ్ డైరక్టర్ విరాట్ భాటియా అడిగిన పలు ప్రశ్నలకు మంత్రి లోకేష్ సూటిగా సమాధానాలిచ్చారు. సదస్సులో వేగవంతమైన ఆర్థిక, సామాజిక అభివృద్ధిగా ఆంధ్రప్రదేశ్ అనే అంశంపై లోకేష్ మాట్లాడుతూ... వేగవంతంగా పరిశ్రమలకు అనుమతులు ఇచ్చేందుకు ఎకనమిక్ డెవలప్ మెంట్ బోర్డును పునరుద్ధరించాం.


ప్రైవేటు సెక్టారు ప్రముఖులతో సలహా మండలి ఏర్పాటుచేశాం. సింగిల్ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ ద్వారా అనుమతులు ఇచ్చే విధానాన్ని అమలుచేస్తున్నాం. రాష్ట్రంలో చేపట్టబోయే ప్రాజెక్టులు, అనుమతులకు మిగతా.. 7లో

బీజేపీ నేతకు

## లిక్కరు లక్కు కిక్కు

- 5 దుకాణాలు ఒక్కరికే!
- సందిరెడ్డి శ్రీనివాసులుకు దుకాణాల పంట

అనంతపురం,మహానాడు: మద్యం దుకాణాల లాటరీలో బీజేపీ అనంతపురం జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు పంట పండింది. ఆయన ఏకంగా ఐదు దుకాణాలను దక్కించుకున్నారు. ఇవాళ పుట్టపర్తిలో కలెక్టర్ చేతన్ ఆధ్వర్యంలో లాటరీ తీయగా ధర్మవరం మున్సిపాలిటీలో దుకాణం 1, 4, ధర్మవరం రూరల్లో 12, ముదిగుబ్బ మండలంలో 19, బత్తలపల్లి మండలంలో 14వ నంబర్ దుకాణాలు ఆయనకు దక్కాయి. ఒక్కరికే ఐదు దుకాణాలు దక్కడం గమనార్హం.





## పెట్టుబడిదారులకు పెద్దపీట

ఫాక్స్‌కాన్ కంపెనీ సందర్శనలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్,మహానాడు: తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకొచ్చే కంపెనీలకు కావలసిన మౌలిక సదుపాయాలు కల్పించే విషయంలో ఎలాంటి అనుమానాలు అక్కరలేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబుతో కలిసి, ముఖ్యమంత్రి హైదరాబాద్ శివారు కొంగరకలాన్‌లోని ఫాక్స్‌కాన్ కంపెనీని సందర్శించారు. ఫాక్స్‌కాన్ ప్రతినిధులతో సమావేశమై FIT KK Park (Foxconn Interconnect Technology Kongara Kalan Park) కంపెనీ పురోగతి, ఇతర అంశాలను అడిగి మిగతా.. 3లో

జనం గుండె చప్పుడు

# మహానాడు


2

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || మంగళవారం 15, అక్టోబర్ 2024 ||


## ఏపీ,తెలంగాణ రోడ్లకు మహర్దశ

### - నితిన్ గడ్కరీ ట్వీట్



**ఢిల్లీ,మహానాడు:** కేంద్రం ఆంధ్ర-తెలంగాణ ప్రజలకు శుభవార్త చెప్పింది. ఆ ప్రకారంగా రెండు రాష్ట్రాల రోడ్లకు మహర్దశ పట్టనుంది. ఈ విషయాన్ని కేంద్రమంత్రి నిత్ని గడ్కరీ ట్వీట్ చేశారు.

ఆంధ్ర-తెలంగాణలో పలు రోడ్ల నిర్మాణ పనులకు కేంద్రం ఆమోదం తెలిపింది.నల్గొండలో రూ.516 కోట్లతో 4 లేన్ల బైపాస్ రోడ్డు నిర్మించనుంది. దీని ద్వారా నకిరేకల్ నుంచి నాగార్జునసాగర్ మధ్య ట్రాఫిక్ సమస్య తీరనుంది. అటు ఆంధ్రలో రూ.400 కోట్లతో 200KM మేర 13 స్టేట్ రోడ్లు అభివృద్ధి చేయనున్నారు. గుంటూరు-నల్లపాడు మధ్య రూ.98 కోట్లతో 4 లేన్ల రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి నిధులు మంజూరు చేసినట్లు నితిన్ గడ్కరీ ట్వీట్ చేశారు.

## గంగానదికి ఒక న్యాయం...
# మూసీకి ఒక న్యాయామా?

- మూసీ నదికి మరణశాసనం రాస్తూ.. సుందరీకరణ ప్రాజెక్టా?
- వీఎల్ఎఫ్ రాడార్ స్టేషన్ నిర్మాణంతో మూసీ అంతర్ధానం
- పదేళ్లు మాపై ఒత్తిడి తెచ్చిన రాడార్ స్టేషన్ నిర్మాణానికి అంగీకరించలేదు
- జనావాసాలు లేని ద్వీపాల్లో ఏర్పాటు చేయాల్సిన రాడార్ తెలంగాణలోనా?
- ఏ ప్రయోజనాలు ఆశించి తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారు.
- గంగానది జన్మస్థానం వద్ద 150 కిలోమీటర్లు ఎకో సెన్సిటివ్ జోన్‌గా ప్రకటించారు.
- రాడార్ ఏర్పాటుకు వ్యతిరేకంగా పర్యావరణ వేత్తలతో కలిసి పోరాటం చేస్తాం
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్,మహానాడు:** వికారాబాద్ జిల్లా దామగుండం అటవీ ప్రాంతంలో నేవీకి సంబంధించిన వీఎల్ఎఫ్ రాడార్ స్టేషన్ నిర్మాణం ఏర్పాటును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తెలిపారు. ఓ వైపు మూసీ సుందరీకరణ ప్రాజెక్ట్ పేరుతో లక్షా 50 వేల కోట్లు ఖర్చు చేస్తామని చెబుతూనే మరోవైపు మూసీ నదిని పూర్తిగా ప్రమాదంలో పడేసే ర్డాడార్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం అంగీకారం తెలపటమేమిటనీ కేటీఆర్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. ఇదెక్కడి ద్వంద్వ వైఖరంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ప్రశ్నించారు.

ఏం ప్రయోజనాలు ఆశించి తెలంగాణ ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారో చెప్పాలని డిమాండ్ చేశారు. మంగళవారం అనగా తేదీ 15-10-2024 రోజున కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ తో కలిసి ఈ ప్రాజెక్ట్‌కు శంకుస్థాపన చేస్తుండటాన్ని బీఆర్ఎస్ పార్టీ వ్యతిరేకిస్తుందన్నారు.

దామగుండంలో రాడార్ ఏర్పాటు కారణంగా పర్యావరణానికి తీవ్రంగా నష్టం వాటిల్లుతుందని కేటీఆర్ చెప్పారు. దాదాపు 2900 ఎకరాల అటవీ భూభాగంతో పాటు 12 లక్షల చెట్లను నరికి వేసి ఈ ప్రాజెక్ట్ నిర్మాణం చేపట్టనున్నారన్నారు. జనవాసాలే లేని చోట ఏర్పాటు చేయాల్సిన రాడార్ కేంద్రాన్ని ఎందుకు తెలంగాణలో నిర్మిస్తున్నారో చెప్పాలన్నారు.

మాట్లాడితే మూసీ పరిరక్షణ అని చెబుతున్న ముఖ్యమంత్రి.. మూసీనే ప్రమాదంలో పెట్టే ఈ ప్రాజెక్ట్‌కు ఎందుకు అంగీకారం తెలిపారో చెప్పాలన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న పదేళ్ల సమయంలో ఎంత ఒత్తిడి తెచ్చినప్పటికీ తమ ప్రభుత్వం ఈ ప్రాజెక్ట్ కు అంగీకారం తెలపలేదని కేటీఆర్ గుర్తు చేశారు.

దేశంలోనే అటవీ సామర్థ్యాన్ని పెంచేందుకు హరిత హారం చేపట్టి అటవీ విస్తీర్ణాన్ని బీఆర్ఎస్ సర్కార్ పెంచిందన్నారు. అలాంటిది రేవంత్ రెడ్డి సర్కార్ అధికారంలోకి వచ్చిన వెంటనే దాదాపు



2900 ఎకరాల అటవీ భూభాగాన్ని నాశనం చేసేలా చర్యలు చేపట్టటమేమిటనీ కేటీఆర్ ప్రశ్నించారు.

గంగానది జన్మస్థానం గంగోత్రి వద్ద 150 కిలోమీటర్ల పరిధిని, కేంద్రం ఎకో సెన్సిటివ్ జోన్ గా ప్రకటించిన విషయాన్నికేటీఆర్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. గంగోత్రికి ఒక న్యాయం...మా మూసీ నదికి మరో న్యాయమా అంటూ నిలదీశారు. దామగుండంలో ఏర్పాటు చేస్తున్న రాడార్ కేంద్రం వికారాబాద్ అడవుల్లోనే మూసీ జన్మస్థానం లోనే ఉందన్నారు. నది పుట్టిన ప్రాంతాన్ని "ఎకో సెన్సిటివ్ జోన్"గా ప్రకటించాలని డిమాండ్ చేశారు.

నేవీ రాడార్ ఏర్పాటుతో మూసీ నది అంతర్ధానం అయ్యే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. "సోర్స్ అఫ్ ద రివర్"పై ఇది గొడ్డలి పెట్టని చెప్పారు. మూసీ నది పురుడు పోసుకున్న చోట... 12 లక్షల చెట్ల నరికివేతతో కోలుకోలేని అనర్థం జరుగుతుందన్నారు. పర్యావరణ సమతుల్యతకు పెనుప్రమాదాన్ని సృష్టించే ఈ ప్రాజెక్ట్ ను విరమించుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

మూసీ నదిని ఘణంగా పెట్టేందుకు సహకరిస్తూ మరో వైపు మూసీ పరిరక్షణ అంటూ ముఖ్యమంత్రి డ్రామాలు చేస్తున్నారని కేటీఆర్ మండిపడ్డారు. మూసీ పరిరక్షణపై ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే రాడార్ నిర్మాణానికి ఎట్టి పరిస్థితుల్లో అంగీకారం తెలిపేది కాదన్నారు. మూసీ పేరుతో వేలకోట్ల దోపిడీ చేయాలన్న ఆలోచనే తప్ప నిజంగా నది పరిరక్షణ పై ఈ ప్రభుత్వానికి ఎలాంటి చిత్తశుద్ధి లేదన్నారు. దేశ రక్షణ విషయంలో తెలంగాణ ముందుం టుంది. కానీ జనావాసాల లేని చోట్ల ఏర్పాటు చేయాల్సిన రాడార్ కేంద్రాన్ని ఈ ప్రాంతంలో ఏర్పాటు చేసి నష్టం చేస్తామంటే అంగీకరించమని చెప్పారు. రాడార్ కేంద్రానికి వ్యతిరేకంగా పర్యావరణ వేత్తలతో కలిసి బీఆర్ఎస్ పోరాటం చేస్తుందని కేటీఆర్ స్పష్టం చేశారు.

# జగన్‌కు కోటరీ ఝలక్

మొదటి పేజీ తరువాయి..

మధుసూదన్‌రెడ్డిని మాత్రమే పిలిపించారు.

ముందు కరణం బలరామ్‌ను జిల్లా అధ్యక్ష పదవి తీసుకోమని ప్రతిపాదించగా, తనకు ఆసక్తిలేదన్నారు. వెంకటేష్‌ను తీసుకోమని ప్రతిపాదించగా.. తన కాలు ఇంకా నయం కాలేదని, అధ్యక్ష పదవి ఇస్తే తిరిగాల్సి ఉన్నందున తాను ఆ పదవికి న్యాయం చేయలేనని స్పష్టం చేశారు. అయితే ఎవరికి ఇచ్చినా సహకరిస్తానని హామీ ఇచ్చారట.

దానితో మాజీమంత్రి గాదె వెంకటరెడ్డి కుమారుడు గాదె మధుసూదన్‌రెడ్డిని.. 'నువ్వే అధ్యక్షపదవి తీసుకో. అందరినీ సమన్వయం చేసుకో. నేను నీకున్నా'నని చెప్పి.. పీఏ కేఎన్‌ఆర్‌ను పిలిచి, సాయంత్రం మధుసూదన్‌రెడ్డి పేరు ప్రకటించమని ఆదేశించారు. బయటకు వచ్చిన మధుఎసూదన్‌రెడ్డికి ఫోన్ చేసిన కేఎన్‌ఆర్, అన్నా మీ ఇంటిపేరు ఏంటని అడగడం.. 'అదేంటి నాన్న గాదె వెంకటరెడ్డి మంత్రి కూడా చేశారు కదా? అని ప్రశ్నించడం జరిగిపోయిందట. అయితే అధ్యక్షుడిగా ఈరోజు ప్రకటించడం కుదరదని, రేపు ప్రెస్‌కు పంపిస్తామని కెఎన్‌ఆర్ ఆయనకు చెప్పారట.

అయితే మరుసటిరోజు సీను మారిపోయింది. స్వయంగా బాపట్ల జిల్లా అధ్యక్షుడిగా ప్రకటి ంచిన గాదె మధుసూదన్‌రెడ్డి బదులు, మాజీ మంత్రి మేరుగ నాగార్జునను జిల్లా అధ్యక్షుడిగా ప్రకటించడంతో, పాపం గాదె బిత్తరపోయారట. తాజాగా ఆయనను రాష్ట్ర కార్యదర్శిగా ప్రకటించారు. జగన్ నిర్ణయం మారేందుకు దీనివెనుక కోటరీ కీలకపాత్ర పోషించిందని బాపట్ల నేతలు విరుచుకుపడుతున్నారు.

సామాజికవర్గ సమీకరణలో భాగంగా ఓసీలకు అధ్యక్ష పదవి ఇస్తే బాగుంటుందన్న కోణంలో.. స్వయంగా జగన్ ఎంపిక చేసిన గాదెను కాదని, మేరుగు నాగార్జున పేరు ప్రకటించడానికి సజ్జల రామకృష్ణారెడ్డే కారణమని వైసీపీ నేతలు విరుచుకుపడుతున్నారు. బాపట్ల మాజీ ఎమ్మెల్యే ఒత్తిడితోనే సజ్జల ఈ నిర్ణయం తీసుకున్నారని.. జిల్లాలో రెండు అసెంబ్లీ, ఒక పార్లమెంటు స్థానం ఎస్సీలకు రిజర్వు అయిన నేపథ్యంలో.. అధ్యక్ష పదవి కూడా వారికే కేటాయిస్తే, ఇక అగ్రకులాలు పార్టీకి ఎలా పనిచేస్తారని నిలదీస్తున్నారు. ఈ మాత్రం కులం లెక్కలు కూడా తెలియని వారు జగన్ పక్కన ఉండటం తమ దురదృష్టమంటున్నారు.

పార్టీ ఓడినా జగన్ పాఠాలు నేర్చుకోలేదనడానికి, ఇదో నిదర్శనమని వైసీపీ సీనియర్లు విమర్శిస్తున్నారు. సజ్జల రామకృష్ణారెడ్డి, అప్పిరెడ్డి, తలశిల రఘురామ్ కోటరీగా ఏర్పడి పార్టీని భ్రష్టుపట్టిస్తున్నారని విరుచుకు పడుతున్నారు. కౌన్సిలర్లుగా కూడా గెలవని వీరంతా మంత్రులు, ఎమ్మెల్యేలుగా చేసిన వారి రాజకీయ భవిష్యత్తు నిర్ణయించటం ఏమిటని మండిపడుతున్నారు.

పార్టీలో తమకు నచ్చని నాయకులను.. వ్యూహాత్మకంగా బయటకు పంపిస్తున్న కోటరీ నేతల రాజకీయాలకు, అగ్రనేతలు సైతం పార్టీని వీడుతున్నారని చెబుతున్నారు. తమకు ఇష్టం లేని నేతలపై ఆ జిల్లాకు చెందిన నాయకులతో, ఈ కోటరీనే జగన్‌కు తరచూ ఫిర్యాదులు చేస్తుంటుంది. వారిపై అనుమానం వచ్చేలా వ్యవహరిస్తుంది. ఇందులో ఈ కోటరీ సక్సెస్ అయిందని విశ్లేషిస్తున్నారు.

మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, మోపిదేవి వంటి అగ్రనేతలు బయటకు వెళ్లేందుకు, ఈ కోటరీనే కీలకపాత్ర పోషించిందని పార్టీ నేతలు గుర్తు చేస్తున్నారు. మోపిదేవికి



టికెట్ రాకపోవడానికి ఈ కోటరీనే కాఅయమంటున్నారు. ఎంపి విజయసాయిరెడ్డి ప్రకాశం జిల్లా ఇన్చార్జిగా ఉన్నప్పుడు ఆయన బాలినేనికి దగ్గరయ్యారన్న అనుమానంతో, బాలినేనికి చెక్ పెట్టిందని చెబుతున్నారు.

ఉమ్మడి ప్రకాశం జిల్లాలో తిరుగులేని పట్టున్న బాలినేనిని బలహీనం చేసేందుకు... వైవి సుబ్బారెడ్డితో కలసి ఈ కోటరీ ఆడిన రాజకీయాలను చివరివరకూ ప్రతిఘటించిన బాలినేని, చివరకు పార్టీ నుంచి నిష్క్రమించి, జనసేనలో చేరాల్సివచ్చిందంటున్నారు. పెదకూరపాడుకు చెందిన హనిమిరెడ్డిని.. అద్దంకి నియోజకవర్గ ఇన్చార్జిగా తెచ్చింది వీరేనంటున్నారు.

గత ఎన్నికల్లో బాలినేని సూచించిన వారికి కాకుండా, మరొకరికి సీట్లు ఇప్పించటంలోనూ ఇదే కోటరీ చక్రం తిప్పిందని గుర్తు చేస్తున్నారు. ఇప్పుడు కూడా పార్టీలోనే ఉన్న బాలినేని వర్గీయుడైన ఓ ఎమ్మెల్యేపె..ట్క జగన్‌కు ఫిర్యాదులు చేయడం ద్వారా, ఆయన కూడా తనంతట తాను బయటకు వెళ్లే రాజకీయాలకు తెరలేపిందని, కోటరీ తీరుపై సీనియర్లు విరుచుకుపడుతున్నారు.

ఒకప్పుడు పార్టీలో నెంబర్‌టూగా ఉంటూ.. జగన్ ఉన్నతి కోసమే రాత్రింబవళ్లు పనిచేసి.. చివరకు ఆయన కోసమే జైలుకు వెళ్లిన ఎంపి విజయసాయిరెడ్డి ప్రాధాన్యం తగ్గించడానికి, ఈ కోటరీ రాజకీయాలే కారణమని సీనియర్లు స్పష్టం చేస్తున్నారు. ఈ కోటరీ రాజకీయాలకు విసుగుచెందిన విజయసాయి.. ఇప్పుడు విజయవాడకు దూరమై, ఢిల్లీ-హైదరాబాద్‌కే పరిమితం కావాల్సి వచ్చిందంటున్నారు.

ప్రధానంగా సజ్జల రాజకీయాలతోనే, కార్యకర్తల కష్టసుఖాలు తెలిసిన విజయసాయి.. పార్టీలో అంటీముట్టనట్లుగా ఉంటున్నారని చెబుతున్నారు. జగన్ సీఎంగా ఉన్నప్పుడు ఆయన నాయకులను కలవ కపోయినా, విజయసాయిరెడ్డి వద్దకు వెళ్లి పనులు చేసుకునేవారని గుర్తు చేస్తున్నారు.

అసలు అప్పుడు విజయసాయిరెడ్డి లేకపోతే చాలా మంది వెళ్లిపోయేవారని, అందరికీ తలలో నాలుకలా ఉంటూ, ఏ స్థాయిలో కూడా జగన్‌పై అసంతృప్తిరాకుండా చూసుకునేందుకు విజయసాయి ఎంత తిప్పలు పడ్డారో, ఎన్ని అవమానాలు గురయ్యారో తమకు తెలుసని ఓ మాజీ మంత్రి చెప్పారు. ఇప్పుడు అలాంటి అంకితభావం గల విజయసాయిరెడ్డిని కూడా, దూరం పెట్టే పరిస్థితి వచ్చిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.

'మా పార్టీకి 11 సీట్లే వచ్చినా జనంలో జగన్‌సార్‌పై జనంలో అభిమానం చెక్కుచెదరలేదు. ఆయన ఎక్కడికి వెళ్లినా వేలల్లో వస్తున్నారు. ఇంత కష్ట సమయంలో కూడా నియోజకవర్గ ఇన్చార్జి పదవులకు విపరీతమైన పోటీ ఉందంటే.. గ్రౌండ్ లెవల్‌లో ఏం జరుగుతుంతో అర్ధం చేసుకోండి. నేను డబ్బులివ్వనని జగన్‌గారు స్పష్టంగా చెప్పిన తర్వాత కూడా, జిల్లా అధ్యక్ష పదవుల కోసం పోటీ ఉందంటే మళ్లీ మేమే అధికారంలోకి వస్తామన్న నమ్మకం ఉన్నట్లే కదా? మరి అలాంటి సానుకూల పరిస్థితులను సద్వినియోగం చేసుకోకుండా, కోటరీ చేతులో బందీ అయితే ఆయనతోపాటు మేమూ నష్టపోతాము కదా? అయినా ఇంత జరిగినా సజ్జలను తప్పించలేదంటే జగన్ గారు, ఎంత గుడ్డిగా ఆలోచిస్తున్నారో అర్ధమవుతోంద'ని ఓ సీనియర్ నాయకుడు వ్యాఖ్యానించారు.

రాష్ట్ర కమిటీ పదవులు సైతం కోటరీని మెప్పించిన వారికే ఇస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జగన్ ఆమోదం లేకుండానే పదవులిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. జగన్ కూడా పూర్తిగా కోటరీ చేతిలో బందీ అయ్యారని, విజయవాడ-బెంగళూరు పర్యటనలకే పరిమితమయ్యారన్న వ్యాఖ్యలు కూడా వినిపిస్తున్నాయి.

'జగన్‌కు ఇష్టమైన పనులేమిటో తెలిసిన ఈ కోటరీ ఆయనను మబ్బుల్లో పెడుతోంది. ఆయన కూడా ఇవన్నీ పట్టించుకోవడం. తనను డబ్బులు అడగకపోతే చాలనుకుంటున్నారు. కోటరీ కూడా అందుకు తగినట్లే పనిచేస్తుండటంతో ఆయన ఏమీ పట్టించుకోవడం లేదు. అపాయింట్‌మెంట్ సిస్టమ్ కూడా ఏమీ మారలేదు. కోటరీ సూచించిన వారికే అపాయింట్‌మెంట్లు ఇస్తున్నారు. ప్రతిపక్షంలోకి వచ్చిన తర్వాత కూడా ఆయనను ఇంకా సీఎంగా ఉన్నట్లుగా కోటరీ భ్రమల్లో పెడుతోంది. అధికారంలో ఉన్నప్పుడంటే నడిచిపోతుంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు కూడా నాయకులను కలవకపోతే ఆయనకు గ్రౌండు రియాలిటీ ఎలా తెలుస్తుంది' అని కడప జిల్లాకు చెందిన ఓ సీనియర్ నేత ప్రశ్నించారు.

# పల్లె పండుగలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం కావాలి

మొదటి పేజీ తరువాయి..

నేను నమ్మి తీసుకున్న నిర్ణయం సరైందే అనిపిస్తోందని ఉప ముఖ్య మంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. ప్రజల కోసం తీసుకునే ఏ నిర్ణయం అయినా వారి మధ్యనే జరగాలి.. వారితోనే జరగాలి.. వారి వల్లనే జరగాలి అన్నదే ప్రభుత్వ ఉద్దేశం అన్నారు. ఎలాంటి గుట్టుమట్లకు తావివ్వకుండా పారదర్శకంగా ముందుకు వెళ్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వారం రోజుల పాటు పల్లెల్లో నిర్వహించబోయే 'పల్లె పండుగ' కార్యక్రమాన్ని కంకిపాడులో ఉప ముఖ్యమంత్రి సోమవారం ప్రారంభించారు. కంకిపాడు, పునాదిపాడుల్లో చేయతలపెట్టిన పనులకు శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా జరిగిన సభలో పవన్ కల్యాణ్ ఏమన్నారంటే.. రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టు 23వ తేదీన నిర్వహించిన గ్రామ సభల్లో 30 వేల పనులకు తీర్మానాలు చేశారు. ప్రజలంతా కలిసి తమ గ్రామాల్లో కావల్సిన అభివృద్ధి పనులను వారే తీర్మానించుకున్నారు. దీనిలో ప్రజా ప్రతినిధుల ప్రమేయం లేదు. పూర్తిగా ప్రజలు తీసుకున్న అభివృద్ధి పనులకు నేటి నుంచి వారం రోజులపాటు శంకుస్థాపనలు జరగనున్నాయి. సంక్రాంతి నాటికి పనులు పూర్తి కావాలన్నదే లక్ష్యం. కీలకమైన పనులన్నీ ఇప్పటికే గుర్తించాం. దానికి కలెక్టర్లు పరిపాలన ఆమోదాలు ఇచ్చారు. దీంతో పనులన్నీ మొదలు కానున్నాయి. ప్రతి పనికి సంబంధించి పూర్తి సమాచారం తెలుసుకునేలా సమాచార బోర్డులు ఏర్పాటు చేయనున్నాం. శంకుస్థాపన చేసిన దగ్గరే ఆయా పనుల పూర్తి వివరాలు దీనిలో ఉంటాయి. సామాన్యుడు సైతం సులభంగా పనులు, నిధులు, నాణ్యత తెలుసుకునేలా వీటిని ఏర్పాటు చేస్తున్నాం. పూర్తి పారదర్శకతతో పనులు జరగాలన్నదే ప్రధాన లక్ష్యం. ప్రజలంతా ఈ పనుల్లో భాగస్వామ్యం కావాలి.

### గత ప్రభుత్వ హయాంలో పంచాయతీరాజ్ మంత్రి ఎవరో తెలీదు

ప్రతిసారీ గత ప్రభుత్వాన్ని విమర్శించాలని అనుకోను కానీ... గత ప్రభుత్వంలో జరిగిన విధ్వంసం మాత్రం కళ్ల ముందు కదలాడుతూనే ఉంటుంది. గత ప్రభుత్వంలో జరిగిన విధానం ఎలా ఉంది.. ఇప్పుడు జరుగుతున్న కూటమి ప్రభుత్వ విధానాలను ఎంత పారదర్శకతతో ఉన్నాయో ప్రజలకు చెప్పాలని భావిస్తాను. గత ప్రభుత్వంలో ప్రజలకు కనీసం పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎవరో కూడా తెలిని దౌర్భాగ్యం ఉండేది. అధికారులు, సిబ్బంది అనేది అసలు తెలీదు.

ఇక గత ప్రభుత్వం అయిదేళ్ల కాలంలో గ్రామ సభలు నిర్వహించిన దాఖలాలు లేవు. ప్రజలు పనులు చేసేందుకు తీర్మానం కాదు కదా... పనులు చేయాలని, సమస్యలు పరిష్కరించాలని అర్జీ ఇచ్చినా పరిష్కరించిన దాఖలాలు లేవు. అసలు పంచాయతీరాజ్ నిధులు ఏమయ్యాయో కూడా తెలీదు. నేను ఈ శాఖ బాధ్యతలు తీసుకున్న తర్వాత అనేకసార్లు నిధుల మీద సమీక్షించినా గత ప్రభుత్వంలో నిధులు ఎలా, ఎటు వెళ్లాయనేది ఓ బ్రహ్మ పదార్థంలా కనిపించింది. కూటమి ప్రభుత్వంలో ప్రతి పని ప్రజలకు తెలియాలి. ప్రజలకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలనే నిర్ణయంతో గ్రామసభలను రికార్డు స్థాయిలో నిర్వహించాం. గ్రామాల్లో ప్రాధాన్యతలను బట్టి ఏం పనులు చేయాలో రాజకీయాలకు అతీతంగా ప్రజలు చేసిన తీర్మానాలతోనే ఇప్పుడు పనులు మొదలు పెడుతున్నాం.

### ప్రజల బాగు కోసం బలమైన నాయకత్వం కావాలన్నదే ఆకాంక్ష

ప్రజలందరి బాగు కోసం బలమైన నాయకత్వం, అనుభవపూర్వక నాయకత్వం కావాలన్నదే నా ఆకాంక్ష. 2014 నుంచి నేను చెబుతున్నది ఇదే. ముఖ్యమంత్రి చంద్రబాబు పరిపాలన అనుభవం రాష్ట్రానికి వరం అవుతుంది. అది రాష్ట్ర శ్రేయస్సుకు ఉపయోగపడుతుంది. ఇప్పుడు జరుగుతున్న పనులను చూస్తే గతంలో కూటమి కోసం నేను తీసుకున్న నిర్ణయం సరైందే అనిపిస్తుంది. కేంద్రం సహకరించడం రాష్ట్రానికి అదనపు బలం. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ దిశానిర్దేశం, కేంద్ర సహకారంతో ముందడుగు వేస్తున్నాం. పాలనలో చంద్రబాబు పనితనం నాకు స్ఫూర్తి. ఆయన క్యాబినెట్ సమావేశాల్లో లేవనెత్తే అంశాలు సీనియర్ బ్యూరోక్రాట్లు కూడా సమాధానం చెప్పలేనంత లోతుగా ఉంటాయి. పాలనలో ఆయన చూపించే చొరవ అద్భుతం. నిరంతరం ప్రజల గురించి ఆలోచించే తీరు, రాష్ట్ర అభివృద్ధి కోసం ఆయనకున్న విజన్ కచ్చితంగా రాష్ట్రానికి మేలు చేస్తుందని భావిస్తున్నాను.

### నిజాయతీగా పనిచేసే అధికారులకు ప్రోత్సాహం

ప్రజలు ఎన్నో ఆశలతో కూటమి ప్రభుత్వాన్ని గెలిపించుకున్నారు. దీన్ని అ0ంతే బాధ్యతగా ముందుకు తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది. కాకినాడలో ఓ అటవీ శాఖ అధికారి నా పేరు ఉపయోగించి చేస్తున్న కొన్ని పనులు నా దృష్టికి ప్రజలే తీసుకొచ్చారు. వెంటనే నేను స్పందించాను. అసలు జరిగిన విషయాన్ని విచారించాలని అటవీశాఖ ఉన్నతాధికారులను ఆదేశించాను. వచ్చిన ఆరోపణలు రుజువైతే సస్పెండ్ చేయడానికి కూడా వెనుకాడేది లేదు. మేమెంత నిజాయతీగా, నిబద్ధతతో ప్రజల కోసం పనిచేస్తున్నామో అధికారులు కూడా అలాగే పని చేయాలి. ప్రజల ఆకాంక్షలు, వారి అవసరాలు తీర్చడానికి అధికారం పనిచేయాలి. అధికారుల విషయంలో చిత్తశుద్ధితో ముందుకు వెళ్తాం. పని చేసిన వారికి తగిన ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు ఏమైనా తేడా వస్తే అంతే కఠినంగా వ్యవహరిస్తాం.

### సమన్వయంతో ముందుకు వెళ్లాలి

పంచాయతీరాజ్,గ్రామీణాభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో జరిగే పనులను ఇతర శాఖలు సమన్వయం చేసుకొని ముందుకు వెళ్లాలి. దాదాపు 10 శాఖలను జాగ్రత్తగా సమన్వయం చేసుకొని ముందుకు వెళ్తేనే పనులన్నీ సకాలంలో పూర్తి అవుతాయి. ఉపాధి హామీ పథకం అనేది చాలా గొప్ప కార్యక్రమం. దానిని సరిగా వినియోగించుకుంటే గ్రామాల్లో చాలా పనులు చేసుకోవచ్చు. కేంద్రం దీనికి వెచ్చిస్తున్న నిధులను, పనిదినాలను గ్రామీణుల జీవనస్థితిగతులు మార్చడానికి ఉపయోగించుకోవచ్చు. పెనమలూరు నియోజకవర్గం, కంకిపాడులో జరుగుతున్న ఈ ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్యే బోడే ప్రసాద్ కంకిపాడు - రొయ్యూరు వయా గోడవరం రోడ్డును నవీకరణ చేయాలని కోరారు. వెంటనే దానిపై తగు చర్యలు తీసుకొని రోడ్డు వేసేలా ముందుకు వెళ్తాం.

అలాగే కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ ఎదురుమొండి - గొల్లమంద పరిధిలోని లంక గ్రామాల్లో అనుసంధాన రహదారులు కావాలని ప్రతిపాదించారు. వీటిని కూడా పూర్తి చేసేలా ఆదేశాలు ఇస్తున్నాను. గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము నందివాడ, గుడివాడ, గుడ్లవల్లేరు మండలాల్లోని 43 గ్రామాల్లో మంచినీటి సమస్య ఉందని, అక్కడ నీటిని ఓ బాటిల్ లో పట్టి మరీ సమస్య చెప్పారు. దీనిపై గ్రామీణ రక్షిత మంచినీటి సరఫరా శాఖ అధికారులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి అక్కడి సమస్యను తీర్చాలని ఆదేశిస్తున్నాను. దీనిపై వెంటనే చర్యలు తీసుకుంటాం. ఈ సందర్భంగా నేను ఒకటే చెప్పదల్చుకున్నాను. గత ప్రభుత్వంలో 151 మంది ఎమ్మెల్యేలను ప్రజలు గెలిపిస్తే ప్రజా సమస్యల కోసం ఇలా చెప్పిన దాఖలాలు లేవు. ఎప్పుడూ బూతులు, తిట్లు తప్ప గత ప్రభుత్వ ఎమ్మెల్యేలు చేసింది శూన్యం. కూటమి ప్రభుత్వంలో ప్రజాప్రతినిధులు బాధ్యతగా నడుచుకోవడం ముచ్చటగా ఉంది. ఎంతోకాలంగా పెండింగ్‌లో మచిలీపట్నం - రేపల్లె రైల్వే లైను విషయాన్ని గౌరవ ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ గారి దృష్టికి తీసుకెళ్లాను.

### సుందర గ్రామాలు సాకారం కావాలి

చిత్తశుద్ధి, పారదర్శకత, అభివృద్ధి కాంక్షతో పనులన్నీ చేస్తున్నాం. పనులతో గ్రామాలు సుందరం కావాలి. పల్లెల్లో మెరిసిపోవాలి. రోడ్లు, గోకులాలు, పాఠశాలలకు ప్రహరీలు, ఉద్యానవనాలు, ట్రెంచ్‌లు, రూఫ్‌టాప్‌లు, పారిశుద్ధ్య పనులు ఇలా ప్రాధాన్యం ఉన్న పనులన్నీ తీసుకున్నాం. 2024 - 25 ఆర్థిక సంవత్సరంలో 3 వేల కిలోమీటర్ల సీసీ రోడ్లు, 500 కిలోమీటర్ల బీటీ రోడ్లు, 120 పాఠశాలలకు ప్రహరీలు, ప్రభుత్వ కార్యాలయ భవనాలకు రూఫ్ టాప్స్, సామాజిక భవనాలు రావాలని భావిస్తున్నాం.

అలాగే ఆర్థిక సంవత్సరంలో 25.50 కోట్ల పని దినాలు, 8 లక్షల కుటుంబాలకు 100 రోజుల పని లక్ష్యంగా పెట్టుకున్నాం. ఊరి అభివృద్ధి కోసం జరుగుతున్న పల్లె పండుగలో గ్రామస్థులంతా ఉమ్మడిగా పాలుపంచుకోవాలి. దీనిలో ప్రతి ఒక్కరి భాగస్వామ్యం అవసరం. రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ గ్రామం కోసం కదలిరండి. దేశంలో ఇప్పటి వరకు ఎక్కడా లేనంత అభివృద్ధిని గ్రామాల్లోకి తీసుకొస్తున్న ఈ శుభతరుణంలో ప్రజలందరి భాగస్వామ్యం అవసరం. ఎంపీలు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులంతా ఈ కార్యక్రమాన్ని వారం రోజుల పాటు ముందుండి నడిపించాలి.

ఈ సభలో మంత్రి కొల్లు రవీంద్ర, ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యేలు బోడె ప్రసాద్, వెనిగండ్ల రాము, కాగిత కృష్ణ ప్రసాద్, వర్ల కుమార్ రాజా, ఎమ్మెల్సీ పిడుగు హరిప్రసాద్, పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్, పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ కృష్ణ తేజ, తదితరులు పాల్గొన్నారు.

### సర్పంచులు రోడ్లపాలయ్యారు : మంత్రి కొల్లు రవీంద్ర

ఎక్సైజ్, గనులు శాఖ మంత్రి కొల్లు రవీంద్ర మాట్లాడుతూ గత ప్రభుత్వ హయంలో రోడ్లు వేసిన వారు రోడ్లు పాలయ్యారు. సకాలంలో బిల్లులు చెల్లించపోవడంతో సర్పంచులు ఆస్తులు అమ్ముకునే పరిస్థితిని తీసుకొచ్చారు. కేంద్రం విడుదల చేసిన రూ.12 వేల కోట్ల నిధులు కూడా సక్రమంగా ఖర్చు చేయలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన 100 రోజుల్లోనే రూ.4,500 కోట్లతో 30 వేల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టాం. 3 వేల కిలోమీటర్ల సిమెంట్ రోడ్లు, 500 కిలోమీటర్ల తారు రోడ్లు,10వేల వాననీటి సంరక్షణ కందకాలు నిర్మిస్తున్నాం అంటే దానికి కారణం ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణే. గత ప్రభుత్వం పంచాయతీ కార్యాలయాలకు పార్టీ కలర్స్ వేసుకున్నారు తప్ప గ్రామాల్లో చేసిన పనులు అయితే ఏమీ లేవు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్.నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం దేశంలోనే నెంబర్ వన్ రాష్ట్రంగా మారుతోంది. గత ప్రభుత్వ హయాంలో కృష్ణా జిల్లా నుంచి మంత్రులు, ఎమ్మెల్యేలుగా పదవులు వెలగబెట్టిన నాయకులు జిల్లాకు చేసింది ఏమీ లేకపోయినా... జిల్లా పరువు మాత్రం తీశారని అన్నారు.

### మహాత్ముడి మాటల స్ఫూర్తితోనే పల్లె పండుగ : బాలశౌరి

మచిలీపట్నం పార్లమెంట్ సభ్యుడు వల్లభనేని బాలశౌరి మాట్లాడుతూ..."గ్రామాలు సామాజికంగా, ఆర్థికంగా పరిపుష్టి చెందితేనే అభివృద్ధి ఫలాలు ప్రజలకు అందుతాయి అని మహాత్మాగాంధీ మాటలను స్ఫూర్తిగా తీసుకొని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పల్లె పండుగ వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. దేశ చరిత్రలో ఏ రాష్ట్రంలో జరగని విధంగా ఒకేరోజు 13,326 గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించి రికార్డు సృష్టించాం. పవన్ కళ్యాణ్ వ్యక్తిత్వం తెలియాలంటే ఆయన తీసుకున్న శాఖలను చూస్తే సరిపోతుంది. గత ప్రభుత్వంలో దాదాపు 3వేల మంది కౌలు రైతులు ఆత్మహత్యలకు పాల్పడితే ఆ కుటుంబాలు రోడ్డున పడకూడదని భావించి ప్రతి కుటుంబానికి లక్ష రూపాయల చొప్పున అందించారు.

వరదల వల్ల 400 పంచాయతీలకు నష్టం జరిగితే ... పంచాయతీకి రూ. లక్ష చొప్పున రూ. 4 కోట్లు అందించి దాతృత్వం అంటే ఏంటో చెప్పిన గొప్ప వ్యక్తి పవన్ కల్యాణ్. గత ప్రభుత్వం కేంద్రం ఇచ్చిన జలజీవన్ మిషన్ నిధులు సక్రమంగా వినియోగించుకోలేకపోయింది. ఆ నిధులను సద్వినియోగం చేసుకొని మచిలీపట్నం, పెడన నియోజకవర్గాల్లో ప్రజల దాహార్తి తీరుస్తాం. ఈ ప్రాంత వాసుల చిరకాల వాంఛ మచిలీపట్నం- రేపల్లె రైల్వే లైన్. ఆ ప్రాజెక్ట్ అతి త్వరలోనే సాకారం చేస్తాం" అని అన్నారు.

### గ్రామాలను స్వర్గసీమలుగా మారుస్తాం : బోడే ప్రసాద్

పెనమలూరు శాసన సభ్యుడు బోడే ప్రసాద్ మాట్లాడుతూ... "రాష్ట్రవ్యాప్తంగా ఈ రోజు రూ.4,500 కోట్లతో 30 వేల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు జరుగుతున్నాయి. సంక్రాంతి కల్లా పనులు పూర్తి చేసి గ్రామాలను స్వర్గసీమలుగా మారుస్తాం. పవన్ కల్యాణ్ పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖలకు మంత్రి గా ఉన్నారు. ఆయన నాయకత్వంలో రాష్ట్రంలో దాదాపు 90 గ్రామాల్లో మౌలిక సదుపాయలు పూర్తి చేస్తామ"ని అన్నారు.

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ ||మంగళవారం 15, అక్టోబర్ 2024||




## ముఖ్యమంత్రికి గర్భిణుల ఆవేదనైనా వినపడుతుందా?

**- ఎక్స్‌లో హరీష్ రావు**



హైదరాబాద్, మహానాడు: ఆస్పత్రిలో ఉండి, పురిటి నొప్పులు పడుతూ వైద్యుల కోసం గంటల పాటు ఎదురు చూస్తున్న గర్భిణుల ఆవేదన వర్ణనాతీతం. పేరుకు కరీంనగర్ జిల్లా హుజురాబాద్ ఏరియా ఆసుపత్రి. కానీ గైనకాలజిస్టు, అనస్తీషియా వైద్యుడు లేని దారుణ పరిస్థితి.

పాలన గాలికి వదిలి, అనునిత్యం రాజకీయాల గురించి మాత్రమే మాట్లాడే ముఖ్యమంత్రి గారికి గర్భిణుల ఆవేదనైనా వినపడుతుందా? తక్షణమే గర్భిణులకు అవసరమైన అత్యవసర వైద్యం అందించి ప్రాణాలు కాపాడాలని విజ్ఞప్తి చేస్తున్నాం.



## తెలంగాణ సినీ పరిశ్రమను ప్రభుత్వం గౌరవిస్తుంది

- ఈ పరిశ్రమ ప్రపంచ స్థాయికి ఎదగాలి
- తెలంగాణ భావోద్వేగాలను తన ఆట, పాట ద్వారా ప్రపంచానికి పరిచయం చేసిన మహోన్నత వ్యక్తి గద్దర్
- తెలంగాణ మొత్తానికి ప్రతిరూపం గద్దర్
- గద్దర్ అవార్డుల కమిటీ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు

హైదరాబాద్, మహానాడు: తెలంగాణ సినీ పరిశ్రమను రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున గౌరవిస్తుందని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. సోమవారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ సచివాలయంలో జరిగిన గద్దర్ సినీ అవార్డుల కమిటీ మొదటి సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ సినీ పరిశ్రమ దేశంలోనే కాదు ప్రపంచములోనే శాసించే స్థాయికి ఎదగాలని అన్నారు.

సినీ పరిశ్రమకు ఏ సమస్యలు ఉన్నా వినడానికి, పరిష్కరించడానికి సిద్ధంగా ఉన్నామని సీఎం రేవంత్ రెడ్డి మీ అందరితో చెప్పాలని కోరినట్టు వివరించారు. సినీ పరిశ్రమల అవార్డుల విషయానికొస్తే నంది అవార్డులు ఒక పండుగల నిర్వహించేవారు. రాష్ట్ర విభజన తర్వాత ఎందుకో గత ప్రభుత్వం ఈ అంశాన్ని పట్టించుకోలేదు అన్నారు.

తెలంగాణ అంటేనే సాంస్కృతిక జీవనం. తెలంగాణ అంటేనే ఆట, పాట.. ఇక్కడ బాధ వచ్చిన సంతోషం వచ్చినా పాట ద్వారానే వ్యక్త పరుస్తాము అని వివరించారు. తెలంగాణ సంస్కృతి చాలా గొప్పది... అందర్నీ అక్కున చేర్చుకొని, ప్రేమించే సంస్కృతి మన రాష్ట్రంలో ఉంటుంది అన్నారు. అసమానతలు, వైరుధ్యాల నేపథ్యంలో రాష్ట్ర ప్రజలు పోరాటం చేసి ప్రత్యేక రాష్ట్రం తెచ్చుకున్నారు అని వివరించారు.

పొడుస్తున్న పొద్దు మీద నడుస్తున్న కాలమా అంటూ సమాజాన్ని తెలంగాణ రాష్ట్ర సాధనకు సమాయత్తం చేసి నడిపించిన ప్రజా యుద్ధనౌక గద్దర్ అని డిప్యూటీ సీఎం అన్నారు. గద్దర్ ఒక లెజెండ్, ఒక శతాబ్ద కాలంలో ఆయన లాంటి వ్యక్తి పుడతారని నేను అనుకోవడం లేదని, ప్రపంచంలోని అన్ని సమస్యలపై ఆయన ప్రజలను పాటలతో కదిలించాలని తెలిపారు.

తెలంగాణ ఆట, పాటను ప్రపంచానికి పరిచయం చేసిన మహోన్నత వ్యక్తి గద్దర్ అని అన్నారు. తెలంగాణలో ఏ గ్రామంలో చూసిన గద్దర్ లాగే పాడాలని ప్రయత్నిస్తుంటారు, ఆయనను అనుకరిస్తుంటారు తెలంగాణ మొత్తానికి గద్దర్ ప్రతిరూపమని తెలిపారు.

అడవి, సినిమా, మానవులు, రాజ్యాంగం అన్నిట్లో గద్దర్ తనదైన ముద్ర వేశారని అన్నారు. గద్దర్ మొదట విప్లవోద్యమ బాటలో అడవి బాట పట్టిన కాలక్రమమైన దేశంలోని అన్ని సమస్యలకు భారత రాజ్యాంగమే పరిష్కారమని భావించి దాన్ని ఆయన విస్తృతంగా ప్రచారం చేశారని వివరించారు.

అన్ని అంశాలు పరిశీలించే రాష్ట్ర ప్రభుత్వం గద్దర్ పేరిట సినిమా అవార్డులు ఇవ్వాలని నిర్ణయించిందని కమిటీ సభ్యులకు వివరించారు.


అన్ని అవార్డుల తరహాలోనే అన్ని రంగాలకు గద్దర్ అవార్డులు ఇచ్చుకోవచ్చని తెలిపారు. సినీ పరిశ్రమలోని అందర్నీ గౌరవించుకోవాలి, ప్రతి అవార్డు గొప్పగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం కోరుతుందని తెలిపారు.

గద్దర్ అవార్డుల కార్యక్రమం గొప్ప పండుగలా జరగాలి, ఏ తేదీన జరపాలనేది కమిటీ నిర్ణయం తీసుకోవాలని కోరారు. గద్దర్ ను అత్యంత ప్రీతిపాత్రమైన వ్యక్తిగా రాష్ట్ర ప్రభుత్వం గుర్తించిందని తెలిపారు. కొద్దిరోజుల్లోనే కమిటీ మరో మారు సమావేశమై త్వరితగతిన నిర్ణయాలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం కమిటీ సభ్యులను కోరారు.

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ కాన్సెప్ట్ అద్భుతమైనదని ప్రముఖ సినీ నిర్మాత దగ్గుబాటి సురేష్ సమావేశంలో డిప్యూటీ సీఎంకు అభినందనలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్కిల్ యూనివర్సిటీలో యాక్టింగ్ స్కిల్స్ నేర్పించేందుకు ప్రత్యేక కోర్స్ ఏర్పాటు చేయాలని కమిటీ సభ్యులు కోరారు.

అన్ని అంశాలు పరిశీలించి ఇంటిగ్రేటెడ్ స్కూల్, స్కిల్ యూనివర్సిటీలో యాక్టింగ్, కల్చర్‌కు సంబంధించిన అంశాలకు చోటు కల్పించడంపై నిర్ణయం తీసుకుంటామని డిప్యూటీ సీఎం తెలిపారు. సమావేశంలో స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, కమిటీ సభ్యులు నర్సింగరావు, తనికెళ్ల భరణి, సురేష్ బాబు, తమ్మారెడ్డి భరద్వాజ, దిల్ రాజు, హరి శంకర్, వందేమాతరం శ్రీనివాస్, అల్లాని శ్రీధర్, గుమ్మడి విమల సమాచార శాఖ కమిషనర్ హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.









## విరాళాల వెల్లువ

అమరావతి, మహానాడు: వరద బాధితులకు సాయం నిమిత్తం పలువురు దాతలు స్పందించి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కలిసి తమ విరాళాల చెక్కులను అందజేశారు. తెలుగుదేశం పార్టీ(టీడీపీ) యర్రగొండపాలెం ఇన్‌చార్జి గూడూరి ఎరిక్షన్ ఆధ్వర్యంలో రూ.30 లక్షలు 85 వేలు విరాళాన్ని అందజేశారు. అలాగే, ఆల్ ఇండియా బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ అసోసియేషన్ ఏపీ సర్కిల్ రూ.3 లక్షల 11 వేల 116. తుళ్లూరు గ్రామ రైతులు రూ.8 లక్షలు, ఎన్ఆర్ఐ టీడీపీ వింగ్(న్యూజిల్యాండ్) రూ.2 లక్షల 70 వేలు అందజేశారు. దాతలకు సీఎం కృతజ్ఞతలు తెలిపారు.





## పెట్టుబడిదారులకు పెద్దపీట

మొదటి పేజీ తరువాయి..

తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు ఫాక్స్‌కాన్ చైర్మన్ యాంగ్ లియూతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. కంపెనీకి కావాల్సిన మౌలిక సదుపాయాల కల్పించడంలో అన్ని విధాలుగా సహకరిస్తామని మరోసారి భరోసా ఇచ్చారు.

కంపెనీ విస్తరణలో భాగంగా తెలంగాణలో మరిన్ని విభాగాల్లో పెట్టుబడులకు ఫాక్స్‌కాన్ ముందుకు రావాలని ముఖ్యమంత్రి కోరారు. ముఖ్యంగా ఎలక్ట్రిక్, లిథియం బ్యాటరీ విభాగాల్లోనూ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టాలని కోరారు. సీఎం పర్యటన సందర్భంగా ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి , స్థానిక ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి , ప్రభుత్వ ఐటీ విభాగం ఉన్నతాధికారులు, ఫాక్స్‌కాన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## భారత రక్షణ క్షిపణి రంగానికి గుర్తింపు తెచ్చిన సూరి భగవంతం

- నూజివీడులో స్మారక కేంద్రం
- నాగాయలంకలో బాలిస్టిక్ లాంచింగ్ పాడ్ ఏర్పాటుకు కేంద్రం ఆమోదం
- ఆగిరిపల్లిలో డాక్టర్ సూరి భగవంతం 115 జయంతి వేడుకలో మంత్రి పార్థసారథి

ఏలూరు, మహానాడు: భారత రక్షణ క్షిపణి రంగంలో ప్రపంచంలో మొదటి మూడు స్థానాలలో భారతదేశం నిలపడంలో డాక్టర్ సూరి భగవంతం పాత్ర ఎంతో ప్రముఖమైనదని, అటువంటి వ్యక్తి ఈ ప్రాంతం వారు కావడం ఎంతో గర్వకారణమని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. శ్రీ శోభనాద్రి లక్ష్మీ నరసింహ వేద శాస్త్ర పాఠశాల ఆవరణలో డీఆర్డీవో పూర్వపు డైరెక్టర్ జనరల్, రక్షణ శాఖ మంత్రి పూర్వ శాస్త్ర విజ్ఞాన సలహాదారు డాక్టర్ సూరిభగవంతం 115వ జయంతి సందర్భంగా ఆయన కాంస్య విగ్రహాన్ని సోమవారం ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, డీఆర్డీవో పూర్వపు చైర్మన్ డాక్టర్ జి.సతీష్ రెడ్డిలతో కలిసి మంత్రి పార్థసారథి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో మంత్రి పార్థసారథి మాట్లాడారు. దేశ రక్షణ శాస్త్ర సాంకేతిక రంగంలో ప్రపంచపటంలో భారత దేశం ప్రముఖ స్థానంలో నిలపడంతో భారత మాజీ రాష్ట్రపతి దివంగత అబ్దుల్ కలాం, సూరి భగవంతం వంటి వారు వేసిన పునాదు లేనన్నారు.

130 కోట్ల మంది భారతీయులు భయం లేకుండా జీవిస్తున్నామంటే ఇటువంటి మహనీయులు దేశరక్షణకు చేసిన కృషే కారణమన్నారు. అటువంటి వారి జీవితాలను ప్రతీ ఒక్కరూ స్మరించుకునేలా వారి జీవిత విశేషాలు తెలియజేసే విధంగా నూజివీడులో సూరి భగవంతం స్మారక కేంద్రాన్ని పెద్దస్థాయిలో ఏర్పాటు చేస్తానని, ఈ కేంద్రంలో ఆయన జీవిత చరిత్ర, వారు రక్షణ శాస్త్ర సాంకేతిక రంగాలలో సాధించిన విజయాలు ప్రజలు తెలుసుకునేందుకు వీలుగా సమాచారాన్ని అందుబాటులో ఉంచుతామన్నారు. శాస్త్ర సాంకేతిక రంగాలలో విశిష్ట కృషి చేసిన వారిని ప్రతీ సంవత్సరం ఎంపిక చేసి, సూరి భగవంతం పేరు మీదుగా అవార్డు ప్రధానం చేసేందుకు ట్రస్ట్ నెలకొల్పాలన్నారు. ఇందుకు తాను 5 లక్షల రూపాయలు విరాళంగా అందజేస్తున్నామని మంత్రి ప్రకటించారు.

దేశ రక్షణలో ప్రధానపాత్ర వహించే బాలిస్టిక్ లాంచింగ్ పాడ్ రాష్ట్రంలోని కృష్ణా జిల్లా నాగాయలంక సమీపంలో కేంద్ర ప్రభుత్వం ఆమోదించిందని, ఇందుకు కృషి చేసిన జి.సతీష్ రెడ్డి ని ఈ సందర్భంగా మంత్రి అభినందించారు. శ్రీ శోభనాద్రి లక్ష్మీ నరసింహ



వేద శాస్త్ర పాఠశాల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానని, పాఠశాల ప్రతినిధులు తెలియజేసిన సమస్యలను వెంటనే పరిష్కరిస్తానని మంత్రి హామీ ఇచ్చారు.




అవనిగడ్డ శాసన సభ్యుడు మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ తెలుగుజాతితో జన్మించిన మహనీయులను గుర్తించి, వారికి జాతీయ స్థాయిలో గుర్తింపు కలిగించాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. సూరి భగవంతం నోబుల్ బహుమతి గ్రహీత డాక్టర్ సీవీ రామన్ ప్రియ శిష్యులని, బెంగుళూరు లోని టాటా ఏరోస్పేస్ రక్షణ సంస్థకు రామన్ అనంతరం డైరెక్టర్ అయ్యారన్నారు. సూరి భగవంతం నిర్వహించిన పదవులను వారి అనంతరం సతీష్ రెడ్డి నిర్వహించారన్నారు. నాగాయలంకకు రాకెట్ ప్రయోగ కేంద్రాన్ని కేంద్ర ప్రభుత్వం మంజూరుచేయడంలో సతీష్ రెడ్డి పాత్ర ప్రధానమైనదని, ఈ కేంద్రం ఏర్పాటుతో కృష్ణా జిల్లా దశ, దిశ మారుతుందన్నారు.

సతీష్‌రెడ్డి మాట్లాడుతూ సూరి భగవంతం 1961లో తొమ్మిదేళ్ళు కేంద్ర రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా పనిచేశారన్నారు. సరి హద్దుల్లో ఉన్న శత్రుదేశాల నుండి దేశానికీ ముప్పు వాటిల్లకుండా



హిమాలయాల్లో, ఈశాన్య రాష్ట్రాలైన లెహ్, అరుణాచల్ ప్రదేశ్‌లలో రక్షణ వ్యవస్థకు సంబంధించి ప్రయోగ శాలలను ఆ రోజుల్లోనే ఏర్పాటు చేశారన్నారు. రక్షణ శాస్త్ర సాంకేతిక రంగాలలో భారతదేశాన్ని ప్రపంచ దేశాలలో ముందు వరసలో నిలబెట్టిన ఘనత సూరి భగవంతంకు దక్కుతుందన్నారు. ఆయన హయాంలో 25 ప్రయోగశాలలు ఏర్పాటుచేశారన్నారు. సూరి భగవంతం ఎంతో ముందు చూపుతో దేశ రక్షణ వ్యవస్థను పటిష్ఠం చేసే దిశగా చర్యలు తీసుకున్నారని, దేశం రక్షణ పరికరాలను దిగుమతి చేసుకునే స్థాయి నుండి ఎగుమతి చేసేస్థాయికి చేరుకోవడంలో సూరి భగవంతం పాత్ర ప్రముఖమైనదన్నారు. 2023-24 సంవత్సరంలో 24 వేల కోట్ల రూపాయల విలువైన ఆయుధాలను విదేశాలకు ఎగుమతి చేశామని, ఇందుకు సూరి భగవంతం రక్షణ శాస్త్ర సాంకేతిక రంగంలో వేసిన బీజమే కారణమన్నారు.

అనంతరం సూరి భగవంతం జీవిత చరిత్రపై ప్రచురించిన " వైజ్ఞానిక క్రాంతి కిరణం" బ్రోచర్‌ను మంత్రి విడుదల చేశారు.

ఈ సందర్భంగా సతీష్ రెడ్డిని, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, తదితరులను మంత్రి సన్మానించారు. అనంతరం సతీష్ రెడ్డి మంత్రి కొలుసు పార్థసారథిని పూలమాల, దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు. అనంతరం మంత్రి వేద పాఠ శాల ఆవరణలో గో పూజ చేశారు.

కార్యక్రమంలో సూరి భగవంతం ఫౌండేషన్ ఫౌండర్, డైరెక్టర్ ఎస్.బి. రామ్, నేషనల్ బుక్ ట్రస్ట్ సభ్యుడు జి.వల్లీశ్వర్, నూజివీడు ఆర్డీవో వాణి, పంచాయతీ రాజ్ ఈఈ బాపురెడ్డి, వేద పాఠశాల కార్యవర్గ సభ్యులు సూరి శర్మ, సలాక రఘునాథ శర్మ, దోర్బల ప్రభాకర శర్మ, ప్రభృతులు పాల్గొన్నారు.

## లిక్కర్ మాఫియాకు, సిండికేట్లకు అడ్డాగా ఆంధ్రప్రదేశ్

- అమ్మకాలు విపరీతంగా పెంచేసి, తద్వారా డిస్టలరీల నుంచి లంచాల ఆదాయం పెంచుకునే కార్యక్రమం
- 20 డిస్టలరీల్లో 14 మీ హయాంలో వచ్చినవే
- లిక్కర్ షాపుల కేటాయింపులపై వైసీపీ అధినేత జగన్ ట్వీట్

అమరావతి,మహానాడు: లిక్కర్ మాఫియాకు, సిండికేట్లకు ఆంధ్రప్రదేశ్ అడ్డాగా మారిపోయింది. ఈ మాఫియాకు సూత్రధారి, పాత్రధారి మీరు కాదా చంద్రబాబుగారూ? అత్యంత పారదర్శకంగా నడుస్తున్న ప్రభుత్వ మద్యం దుకాణాలను మూసివేసి, వాటిని ప్రయివేటుకు, మీవారికి అప్పగించాలన్న మీ నిర్ణయం అవినీతికోసం వేసిన స్కెచ్ కాదా?

మీ మనుషులతో సిండికేట్ ఏర్పాటుచేసి షాపులను కొట్టేయడం నిజం కాదంటారా? రానున్న ఐదేళ్లలో పెద్దమొత్తంలో ఎమ్మార్పీ కంటే అధిక రేట్లతో అమ్మి, మీరు అనుమతిచ్చిన డిస్టలరీలద్వారా అమ్మకాలు భారీ స్థాయిలో పెంచేసి వేలకోట్ల రూపాయల అక్రమ రాబడికి ద్వారాలు తెరిచిన మాట వాస్తవమే కదా?

మీరు తెచ్చిన లిక్కర్ పాలసీ గొప్పదే అయితే రాష్ట్రవ్యాప్తంగా మంత్రులు, ఎమ్మెల్యేలు మీ కనుసన్నల్లో



ఎందుకు బెదిరింపులకు దిగారు? నిష్పక్షపాతంగా వ్యవహరించిఉంటే అరాచకాలకు పాల్పడాల్సిన అవసరం ఏమొచ్చింది? "నీకింత నాకింత" అని కమీషన్ల వాటాలు వేసుకున్న మాట వాస్తవం కాదా? మీరు ఇవన్నీ చేసిన తర్వాత నిర్ణయించిన ధరకే మద్యాన్ని అమ్ముతారా? ఇది ఓ ఫార్స్ కాదా?

లైసెన్స్ ఫీజులతోపాటు కిందనుంచి మీ దాకా కమీషన్లు కోసం, మీవారికి షాపులు ఇవ్వని పక్షంలో బదులుగా వాటాలు సమర్పించడంకోసం, లిక్కర్ కొనుక్కున్నవారి జేబులు గుల్లచేయడానికి మీరంతా సిద్ధం అయినట్టేకదా? మీకింత వారికింత చొప్పున నచ్చిన రేట్లకు అమ్ముకోవడానికి సిండికేట్లకు ఓకే చెప్పినట్టే కదా? దీనివల్ల తమ కుటుంబాల్లో చదువులకోసం, ఇతర బాగోగులకోసం ఖర్చుకావాల్సిన ప్రజల ఆదాయాలను మీ జేబుల్లోకి వేసు కోవడానికి పన్నిన అవినీతి పథకం కాదంటారా చంద్ర బాబుగారూ?

కొత్తపాలసీ వల్ల ప్రభుత్వానికి వచ్చే ఆదాయం రానీయకుండా, మీరు గండికొట్టారు. ప్రజలను మభ్యపెట్టడానికి చీప్ లిక్కర్ రేట్లు తగ్గిస్తున్నట్టు ప్రకటించి, దీనికోసం క్వాలిటీని తగ్గిస్తూ, ఇంకోవైపు అమ్మకాలు విపరీతంగా పెంచేసి, తద్వారా డిస్టలరీల నుంచి లంచాల ఆదాయం పెంచుకునే కార్యక్రమం చేస్తున్నారు.

ఎందుకంటే రాష్ట్రంలో ఉన్న 20 డిస్టలరీల్లో 14 మీ హయాంలో వచ్చినవే. వైయస్సార్‌సీపీ హయాంలో ఒక్క డిస్టరీలకి కూడా అనుమతి ఇవ్వలేదు. ఇంకోవైపు ఎమ్మార్పీ మీద నియంత్రణ తీసివేసి, మీ వారికి, మీ మాఫియాకు షాపులు అప్పగించి, అక్కడకూడా మీకు ఇంత నాకు ఇంత అని ఎమ్మార్పీపైన రేట్లు పెంచి వసూలు చేయడం ప్రజల నడ్డి విరగొట్టడం కాదా చంద్రబాబుగారూ?

ప్రభుత్వ దుకాణాల ద్వారా మద్యం అమ్మితే అమ్మకాలపై నియంత్రణ ఉంటుంది. అమ్మకం వేళలు కూడా నియంత్రణలో ఉంటాయి. దీనివల్ల మద్య నియంత్రణ అనే ప్రాథమిక బాధ్యత దిశగా ప్రభుత్వాలు కాస్తైనా పని చేసినట్టు అవుతుంది. చంద్రబాబుగారూ ఇప్పుడు మీ విధానం ద్వారా మీ సొంత ఆదాయంకోసం ఆ లక్ష్యానికి తూట్లుపొడిచినట్టే కదా? ఒక ఫక్తు లిక్కర్ వ్యాపారిలా ఆలోచిస్తున్నారు కాని, రాష్ట్రానికి తండ్రి స్థానంలో ఉన్న ముఖ్యమంత్రిలా ఎందుకు ఆలోచన చేయడంలేదు? కారణం ఈ కొత్త పాలసీలో మీ సొంతలాభం ఉండబట్టే కదా?

2014-19 మధ్య ఇదేమాదిరిగా రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చారు. ప్రజల ఆరోగ్యాలను, కుటుంబాల పరిస్థితులను పణంగా పెట్టేలా లిక్కర్ పాలసీని తెచ్చి దాని మీద కాసులు ఏరుకున్నారు. అప్పట్లో మీ సిండికేట్లు బడిపక్కన, గుడిపక్కన బెల్టుషాపులు పెట్టిమరీ ప్రతి ఇంటికీ డోర్‌డెలివరీ స్థాయికి పరిస్థితులను తీసుకెళ్లాయి. కాగితాల మీద కనిపించే దుకాణాలే కాకుండా, వాటికి అదనంగా పర్మిట్ రూమ్స్, దీనికి తోడుగా 43వేల బెల్టుషాపులతో లిక్కర్ ఏరులై పారింది.


వైయస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే అలాంటి దారుణ పరిస్థితులను కూకటివేళ్లతో పెకలించింది. మద్యం దళారులకు, అందులోని రాజకీయ వ్యాపారులకు చెక్ పెట్టింది. దుకాణాల సంఖ్యను 4,380 నుంచి 2,934కు తగ్గించి మద్యం అమ్మకాలను నియంత్రించింది. అమ్మకాలు కేవలం ప్రభుత్వం ఆధ్వర్యంలోనే జరిగేలా చేసింది. లాభాపేక్షలేనందున పర్మిట్‌రూమ్స్, బెల్టుషాపులు.. ఇవన్నీ రద్దు అయ్యాయి.

ఈ పద్ధతిని ఇప్పుడు ఎత్తివేసి, దుకాణాల సంఖ్యను మళ్లీ పెంచి మొత్తం అన్నింటినీ మీ మనుషులకు అప్పగించారు. ఇక వీళ్లు ఏర్పాటు చేసే పర్మిట్‌రూమ్స్, బెల్టుషాపులకు లెక్కే లేదు. మళ్లీ రాష్ట్రాన్ని పూర్వపు దారుణ పరిస్థితులకు తీసుకెళ్తున్న మాట వాస్తవం కాదా చంద్రబాబుగారూ?

లక్షల సంఖ్యలో ఉద్యోగాలంటూ అబద్ధాలుమీద, అబద్ధాలు చెప్పి రోజూ మీ మీడియాలో ఊదరగొట్టే మీరు, మీ స్వార్థం కారణంగా ప్రభుత్వ లిక్కర్ షాపుల్లో పనిచేస్తున్న 15వేలమంది ఒక్కసారిగా నిరుద్యోగులై రోడ్డునపడ్డారు. మరి, వీరి బాగోగుల సంగతేంటి చంద్రబాబుగారూ?

మీ అక్రమార్జనకోసం, మీకు, మీవాళ్లకు అవినీతి డబ్బు సంపాదించడంకోసం మీరు అమలు చేస్తున్న లిక్కర్ పాలసీ రాష్ట్రానికి, ప్రజల భవిష్యత్తుకు ప్రమాదకరం. అక్కచెల్లెమ్మల ఉసురు, యువత ఉసురు, ఆరోగ్యం రూపేణా ప్రజల ఉసురు మీరు పోసుకున్నట్టే. విద్య, వైద్యం, వ్యవసాయ రంగాలను ఇప్పటికే తిరోగమనం పట్టించారు. అవినీతి ధ్యేయంగా తెచ్చిన లిక్కర్ పాలసీతో రాష్ట్రాన్ని మరింత వెనక్కి లాగుతున్నారు. మీ చర్యలను వెంటనే సరిదిద్దుకోండి. లేకుంటే ప్రజల తరపున ఉద్యమిస్తాం

జనం గుండె చప్పుడు
# మహానాడు
www.mahanaadu.com
డిజిటల్ న్యూస్ పేపర్ ||మంగళవారం 15, అక్టోబర్ 2024||




నటుడు రాజేంద్రప్రసాద్ కూతురు చిత్రపటానికి పూలు ఘటించి నివాళులర్పించిన కేటీఆర్, నటుడు రాజేంద్ర ప్రసాద్‌ను పరామర్శించిన కేటీఆర్

## ప్రధాన నిందితుడి సరెండర్!

◆ **టీడీపీ ఆఫీసుపై దాడి కేసు**



**మంగళగిరి, మహానాడు:** తెలుగుదేశం పార్టీ(టీడీపీ) ఆఫీసుపై దాడి కేసులో ప్రధాన నిందితుడు, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి అనుచరుడు పానుగంటి చైతన్య మంగళగిరి కోర్టులో లొంగిపోయారు. వైసీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్న చైతన్య ఈ దాడిలో ప్రత్యక్షంగా పాల్గొన్నట్టు పోలీసులు గుర్తించారు. కూటమి ప్రభుత్వం రాగానే ఆయన అజ్ఞాతంలోకి వెళ్లారు. ఇదే కేసులో అప్పిరెడ్డి, తలశిల రఘురామ్, దేవినేని అవినాశ్ సోమవారం మంగళగిరి పోలీసు స్టేషన్ లో విచారణకు హాజరయ్యారు.

## పంచాయతీలకు పూర్వవైభవం తెచ్చేందుకే పల్లె పండుగ

- **గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము**
- **రూరల్ మండలంలో జరిగిన పల్లె పండుగలో...... కూటమి నేతలతో కలిసి పాల్గొన్న ఎమ్మెల్యే రాము**
- **రూ.79 లక్షలతో సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే....**



**గుడివాడ,మహానాడు:** గత ఐదేళ్ల వైకాపా పాలనలో నిర్వీర్యమైన పంచాయితీ వ్యవస్థకు పూర్వ వైభవం తీసుకొచ్చి, గ్రామాలను అభివృద్ధి పదంలో నడిపేందుకు పల్లె పండుగ కార్యక్రమం నిర్వహిస్తున్నామని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు.

గుడివాడ రూరల్ మండలంలో నిర్వహించిన పల్లె పండుగ కార్యక్రమంలో అధికారులు.....కూటమి నేతలతో కలిసి ఎమ్మెల్యే రాము పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మెల్యే రాము.... కూటమినేతలకు గ్రామ గ్రామాన ప్రజలు ఘన స్వాగతం పలికారు.

## పారిశుద్ధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి

◆ **ఎమ్మెల్యే గళ్ళా మాధవి**



**గుంటూరు, మహానాడు:** నగర ప్రజల ఆరోగ్య పరిరక్షణకు, పరిశుభ్రతకు కృషి చేస్తున్న నగరపాలక సంస్థ పారిశుద్ధ్య కార్మికుల సేవలు అభినందనీయమని, వారి సేవలు వెలకట్టలేని వని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి పేర్కొన్నారు. సోమవారం 23వ డివిజన్ నగరంపాలెంలో ఆడిటర్ గోపికృష్ణ ఆధ్వర్యంలో మహిళా శానిటరీ సిబ్బందికి దుస్తులు పంపిణీ చేసే కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజర య్యారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులు కరోనాలో ప్రాణాలను లెక్క చేయకుండా వీధులు శుభ్రం చేశారన్నారు. నగర పరిశుభ్రతపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని కార్మికులకు సూచించారు. పారిశుద్ధ్య పనులు చేస్తూ తీవ్రమైన దుర్గంధాల నుంచి ప్రజలను కాపాడుతూ విశిష్ట సేవలు అందిస్తున్నారని ఎమ్మెల్యే కొనియాడారు. దాతృత్వంతో ముందుకు వచ్చి కార్మికులకు దుస్తులు పంపిణీకి ముందుకు వచ్చిన ఆడిటర్ గోపికృష్ణను అభినందిస్తున్నట్టు తెలిపారు.

ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి శనకాయల అరుణ, సాధు రాజేష్, లామ్ వర్ధన్ రావు, గంటా పెద్దబ్బాయి, తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీరాజ్ వ్యవస్థకు పూర్వవైభవం

◆ **మాజీ మంత్రి పీతల సుజాత**



**మంగళగిరి, మహానాడు:** పంచాయతీరాజ్ వ్యవస్థకు పూర్వ వైభవం తీసుకొచ్చే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని మాజీ మంత్రి పీతల సుజాత అన్నారు. ఈ సందర్భంగా సోమవారం మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ(టీడీపీ) కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. నేటి నుంచి వారం రోజులపాటు ఆంధ్ర రాష్ట్రంలో పల్లె పండుగ వారోత్సవాలు జరుగుతాయి. 4500 కోట్ల రూపాయలతో 30 వేల అభివృద్ధి పనులను జనవరి నెలాఖరులోగా పూర్తి చేస్తాం. గత వైసీపీ పాలనలో పంచాయతీరాజ్ వ్యవస్థను నిర్వీర్యం చేశారు. దాదాపు 13000 కోట్ల రూపాయల పంచాయతీల నిధులను వైసీపీ ప్రభుత్వం దారి మళ్లించింది. ప్రజలచేత ఎన్నుకున్న సర్పంచ్ లను, వార్డు మెంబర్‌లను అవమానించి గ్రామాల్లో అభివృద్ధి చేయనివ్వలేదు. ఉపాధి హామీ పథకం ద్వారా 45180 జాబ్ కార్డ్స్‌ను వైసీపీ ప్రభుత్వం తొలగించింది. 2 లక్షల మంది పేదలకు ఉపాధి హామీ పనులు లేకుండా చేశారని ఆరోపించారు.

ఉపాధి హామీ పనులకు సంబంధించి రూ. 2 వేల కోట్లు బకాయిలు పెట్టారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ఆ బకాయిలను విడుదల చేసింది. వైసీపీ ప్రభుత్వంలో సర్పంచ్‌లకు, వార్డు మెంబర్ లకు పనిలేకుండా చేశారు. 2014 – 19వ సంవత్సరంలో దళిత వాడల్లో 27000 కిలోమీటర్ల సిమెంట్ రోడ్లు వేసిన ఘనత నారా లోకేష్‌ది. అంతే కాకుండా 22 వేల కిలోమీటర్లు బీటీ రోడ్లు నిర్మించారు. 27 లక్షల ఎల్ఈడీ లైట్లను ఏర్పాటు చేశారు. దాదాపు 6000 వరకు అంగన్వాడీ భవనాలు నిర్మించారు. ఇలా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను గ్రామాల్లో టీడీపీ చేపట్టింది. కూటమి ప్రభుత్వంలో రాబోయే రోజుల్లో 3 వేల కిలోమీటర్ల సీసీ రోడ్లు, 500 కిలోమీటర్ల తారు రోడ్లు నిర్మించాలని నిర్ణయించాము. 25000 గోకులాలు నిర్మిస్తాం. 10 వేల కందకాలు ఏర్పాటు చేస్తామన్నారు.

పండుగలకు వేదికగా గ్రామాలు ఉండేవి. కాని వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత సంస్కృతి సంప్రదాయాలను పక్కన పెట్టి గ్రామాలను నాశనం చేసింది. కూటమి ప్రభుత్వం ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేస్తుంది. గత టీడీపీ ప్రభుత్వంలో నరేగ నిధులను ఉపయోగించి గ్రామాలను అభివృద్ధి చేశాం. కానీ వైసీపీ ప్రభుత్వం నరేగ నిధులను పక్కదారి పట్టించి జేబులు నింపుకుంది. చంద్రబాబు నాయుడు పాలనలో మాత్రమే గ్రామాల అభివృద్ధి జరిగింది. జగన్ పాలనలో జలజీవన్ మిషన్ ను నిర్వీర్యం చేశారు. ఆ జలజీవన్ మిషన్ లో కూడా 100 కోట్ల స్కామ్ చేశారు. పేదలకు మంచినీరు ఇచ్చే విషయంలో కూడా నిధులను దోచుకున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలు ఉండే ప్రాంతాల్లో అభివృద్ధి జరగకుండా చేసిన ఘనత వైసీపీదే. కూటమి ప్రభుత్వంలో పంచాయతీరాజ్ వ్యవస్థను గాడిలో పెట్టి గ్రామాలకు పూర్వ వైభవం తీసుకొస్తాం. పల్లె పండుగ వారోత్సవాలను విజయవంతం చేయాలని మాజీ మంత్రి పీతల సుజాత కోరారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకోవాలి

◆ **ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ**

**సత్తెనపల్లి, మహానాడు:** వేద కాలేజ్, కాకతీయ కల్యాణ మండపంలో ఉమ్మడి కృష్ణ గుంటూరు జిల్లాల గ్రాడ్యుయేట్స్ ఎమ్మెల్సీ ఎన్నికల అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ, ఆలపాటి రాజా, పరిశీలకుడు వేములకొండ శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కన్నా లక్ష్మీనారాయణ ఏమన్నారంటే.. జరగబోయే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు విద్యావంతులు, మేధావులు ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకోవాలి. ఓటు నమోదు కోసం ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తాం. ప్రతిభవంతులైన ప్రతి ఒక్కరు ఓటు హక్కు వినియోగించుకునేలా చూడాలి. ప్రతి గ్రాడ్యుయేట్ ఓటును నమోదు చేయించాలి. ప్రతి గ్రాడ్యుయేట్ ఓటును నమోదు చేయించాలి. గ్రామస్థాయి నుంచి పార్టీ సభ్యత్వాన్ని బలోపేతం చేయాలి.




ఉమ్మడి గుంటూరు కృష్ణా జిల్లా ఎమ్మెల్సీ అభ్యర్థి ఆలపాటి రాజా మాట్లాడుతూ... వ్యవస్థలన్నింటిని కలుషితం చేసిన వ్యక్తి జగన్.

విద్యావంతులకు ఉద్యోగాలు లేకుండా చేసింది జగన్. రాష్ట్రాన్ని గంజాయి వనంగా మార్చిన ఘనత జగన్‌ది. కలుషిత మద్యాన్ని వరదలై పారించిన ఘనత జగన్‌ది. విద్యా వ్యవస్థల్ని నాశనం చేసిన ఘనత గత ప్రభుత్వానికి చెందు తుంది. గత ప్రభుత్వంలో రాష్ట్రంలో ఎక్కడ కూడా ఉద్యోగం అవకాశాలు కల్పించలేదు.

కూటమి ప్రభుత్వం వచ్చిన 100 రోజుల్లోనే రాష్ట్రం అభివృద్ధి దిశగా అడుగులు వేస్తుందని తెలిపారు. అలాగే, ప్రతిభావంతులు, మేధావులు అందరూ కూడా ఓటును నమోదు చేసుకోవాలని, జరగబోయే గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి ఓటు వేసి అత్యధిక మెజారిటీ తోటి గెలిపించాలని ఆయన అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాల్లో ఉన్న రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ పట్టణ, మండల, గ్రామ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## మత విద్వేషాలకు పాల్పడితే కఠిన చర్య

◆ **మాజీ మంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్**

**హైదరాబాద్, మహానాడు:** మత విద్వేషాలను రెచ్చగొట్టే చర్యలకు పాల్పడే వారు ఎంతటివారైనా కఠినంగా శిక్షించాలని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ డిమాండ్ చేశారు. మోండా మార్కెట్, కుమ్మరిగూడలో గల ముత్యాలమ్మ దేవాలయంలో సోమవారం తెల్లవారుజామున గుర్తు తెలియని దుండగులు అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆలయంలోకి వెళ్ళి పరిశీలించారు. పోలీసు అధికారులు, స్థానికులను ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. అమ్మవారి విగ్రహాన్ని ధ్వంసం చేసిన నిందితులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు ఎమ్మెల్యేను కోరారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో ప్రశాంతంగా ఉన్న ఈ ప్రాంతంలో ఇలాంటి ఘటనలు మత ఘర్షణలకు దారితీసే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. నిన్నటి వరకు బతుకమ్మ, దుర్గామాత నవరాత్రులు ఎంతో ఘనంగా, భక్తి శ్రద్ధలతో జరుపుకోవడం జరిగింది. ఇంతలోనే ఈ ఘటన జరగడం బాధాకరం అన్నారు. ఈ ఘటనతో ఒక వర్గం ప్రజలు తమ మనోభావాలను దెబ్బతీసే చర్యగా తీవ్ర ఆగ్రహంతో ఉన్నారని పేర్కొన్నారు.

ఈ ఘటనలో ఇద్దరు, ముగ్గురు వరకు భాగస్వాములు అయినట్టుగా స్థానికులు పేర్కొంటున్నారని, వారిలో ఒక్కరు మాత్రమే పోలీసుల అదుపులో ఉన్నారని తెలిపారు. ఈ ఘటనలో ఎంతమంది ఉన్నారో పూర్తిస్థాయి విచారణ జరిపి దోషులు ఎంతటి వారైనా కఠినంగా వ్యవహరించాలని అన్నారు. ఎమ్మెల్యే వెంట మోండా డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఆకుల హరికృష్ణ, నాయకులు నాగులు, మహేందర్, మహేష్, సత్యనారాయణ, అమర్ తదితరులు ఉన్నారు.

## జగన్ పీక నులిపేసిన పంచాయతీలకు కూటమితో కొత్త ఊపిరి

◆ **ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు**

**వినుకొండ, మహానాడు:** అయిదేళ్ల వైసీపీ నిరంకుశ పాలనలో జగన్మోహన్ రెడ్డి పీక నులిపేసిన పంచాయతీలకు కూటమి ప్రభుత్వం కొత్త ఊపిరి అందిస్తోందని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. గాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్యం సాకారం కోసమే ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పరితపిస్తున్నారని తెలిపారు.

ఈపూరు మండలం బోడెపూడివారిపాలెం పంచాయతీ బోడిశంభునివారిపాలెంలో నిర్వహించిన పల్లె పండగకు ఎమ్మెల్యే జీవీ, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు హాజరయ్యారు. గ్రామసభలో చేసిన తీర్మానం మేరకు రూ.10 లక్షల ఉపాధి హామీ నిధులతో అంతర్గత సీసీ రహదారులు, డ్రైనేజీలు, మినీ గోకులం నిర్మాణాలకు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ హయాంలో కనీసం మాడిపోయిన బల్బులు మార్చలేదని, 5 ఏళ్ల జగన్ పాలనలో స్థానిక సంస్థల నిధులు రూ.12 వేల కోట్లు దారి మళ్లించి దోచుకున్నారని విమర్శించారు.

అలాంటి పరిస్థితుల నుంచి కూటమి ప్రభుత్వం ఏర్పడిన 4 నెలల్లోనే స్థానిక సంస్థలకు రూ.1452 కోట్లు విడుదల చేశారన్నారు. ఉపాధి హామీ నిధులు కూడా 35



వేల కోట్లకు పైగా దోచుకున్న దొంగల ముఠా వైసీపీ ప్రభుత్వమని ఆరోపించారు. గ్రామసీమల అభివృద్ధికి సీఎం చంద్రబాబు రూ.4,500 కోట్లు కేటాయించారని, డిప్యూటీ సీఎం పవన్ గ్రామ సభలు ఏర్పాటు చేసి 30 వేల పనుల అభివృద్ధికి నిధులు మంజూరు చేశారన్నారు.

మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ బోడిశంభునివారిపాలెంలో మౌలికవసతుల కల్పనకు గ్రామ



పెద్దలంతా ఐక్యంగా ముందుకు వచ్చారని అభినందించారు. గ్రామంలో లోఓల్టేజీ సమస్య ఉందని, మాడిపోయిన బల్బులు వేయలేదని, సీసీ డ్రైన్లు లేవన్నారు. వీటన్నింటిని ఎమ్మెల్యే జీవీ పూర్తి చేస్తారన్నారు.

## పల్లె పండుగ వారోత్సవాలను ప్రారంభించిన ఎమ్మెల్యే ముత్తుముల

- **కృష్ణంశెట్టి పల్లె, కంచిపల్లె పంచాయతీలలో రూ. 75 లక్షల రూపాయలతో నిర్మించనున్న సీసీ రోడ్లకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే ముత్తుముల**

**గిద్దలూరు,మహానాడు:** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పల్లె పండుగ ప్రగతికి అండగా కార్యక్రమాన్ని గిద్దలూరు శాసన సభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి మండలంలోని కృష్ణంశెట్టిపల్లె గ్రామ పంచాయతీలో ప్రారంభించారు. మొదటగా కె.ఎస్ పల్లె గ్రామ పంచాయతీలోని ఉప్పలపాడు గ్రామంలో రూ. 10 లక్షలు, అక్కలరెడ్డి పల్లె గ్రామంలో రూ.10 లక్షలు, కృష్ణంశెట్టిపల్లె గ్రామంలో రూ.30 లక్షల రూపాయలతో నిర్మించనున్న అంతర్గత సిసి రోడ్లకు ఎమ్మెల్యే అశోక్ రెడ్డి శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎన్డీఏ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం గ్రామాలలో అభివృద్ధి చేసే దిశగా నేడు తొలి అడుగు పడిందని, గ్రామాల్లో ప్రజలకు కావలసిన అన్నీ మౌలిక వస



తులను కల్పించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని, గత వైసిపి పాలనలో జరిగిన నష్టాన్ని అధిగమించి, రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో ముందుకు నడిపించే బాధ్యత ఎన్డీఏ ప్రభుత్వం తీసుకుంటుందని, మేనిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని నెరవేరుస్తామన్నారు.

ఎమ్మెల్యే ముత్తుముల సమక్షంలో స్థానిక సర్పంచ్ దాసరి ఎలిజబెత్ తెలుగుదేశం పార్టీలో చేరగా, వారికి టిడిపి కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం కంచిపల్లె గ్రామ పంచాయతీలో రూ. 25 లక్షల రూపాయలతో నిర్మించనున్న సిసి రోడ్లకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు.

## ఆర్టీసీ బస్సు ప్రయాణం సురక్షితం

- **నూతన బస్సులను ప్రారంభించిన మంత్రి**

**నంద్యాల, మహానాడు:** ఆర్టీసి బస్సు ప్రయాణం సురక్షితమని, ప్రయాణికులు ఆర్‌టీసి బస్సుల్లో ప్రయాణం చేయాలని మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం సాయంత్రం నంద్యాల ఆర్టీసీ బస్టాండ్‌లో నూతన బస్సులను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయశాఖ మరియు మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ ఆర్టీసీ అధికారులు ప్రారంభించడం జరిగిందన్నారు

ఈ సందర్భంగా మంత్రివర్యులు ఎన్ఎండి ఫరూక్ మాట్లాడుతూ నంద్యాలకు నూతనంగా ఏర్పాటు చేసిన బస్సులను అందరూ సద్వినియోగం చేసుకోవాలని నంద్యాల జనాభా పెరగడం అదేవిధంగా మేనిఫెస్టోలో పొందుపరిచిన విధంగా నూతన బస్సులను కేటాయించడం అందులో భాగంగా ఈరోజు 3 బస్సులను ఒక బస్సు ను శ్రీశైలంకు, రెండు బస్సులను హైదరాబాదుకు కేటాయిస్తూ వాటిని ప్రారంభించడం జరిగిందని దీనిని అందరూ



సద్వినియోగం చేసుకోవాలని వీలైనంత వరకు ఆర్టీసీ బస్సుల్లోనే ప్రయాణం చేయాలని కోరార.

అలాగే త్వరలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభిస్తున్నారని, ఇచ్చిన హామీని టీడీపీ ప్రభుత్వం అమలు చేయబోతోందన్నారు, ప్రజలు కోరిక మేరకే నూతన బస్సులను ఏర్పాటు చేసి వాటిని ప్రారంభించడం జరిగిందని ఇది ప్రజా ప్రభుత్వమని ప్రజల సమస్యలను తీర్చడంలో ముందుండే ప్రభుత్వం తెలుగుదేశం ప్రభుత్వమని తెలియజేశారు

ఈ కార్యక్రమంలో డిపిడిఓ రజియా సుల్తాన, డాక్టర్ బాబాన్, కౌన్సిలర్లు శ్రీదేవి, జైనాభి మరియు ఆర్టీసీ అధి కారులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || మంగళవారం 15, అక్టోబర్ 2024



## తుపాను... ప్రభుత్వం అప్రమత్తం!

- హెూం మంత్రి అనిత వెల్లడి

**విశాఖపట్నం, మహానాడు:** బంగాళాఖాతంలో అల్పపీడనం నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైందని హెూం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. ఇప్పటికే అన్ని జిల్లాల కలెక్టర్లతోనూ మాట్లాడామని, ఎలాంటి ప్రమాదం జరగకముందే ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్ బృందాలను రంగంలోకి దించుతున్నామని చెప్పారు. ఈ మేరకు ఆమె మీడియాతో ఏమన్నారంటే.. తుపాను వల్ల ఏ ప్రాంతాలు ప్రమాదానికి గురవుతాయో ముందుగా గుర్తించాం.. అక్కడికి బృందాలను పంపిస్తున్నాం. తుపాను షెల్టర్‌లు సిద్ధం చేసాం. చిత్తూరు, కర్నూలు, తిరుపతి, ప్రకాశం, ప్రాంతాలను ముందుగా అప్రమత్తం చేశాం. ప్రతి మండలంలోనూ కమాండ్ కంట్రోల్ రూమ్ లో సిద్ధం చేస్తున్నాం. గంట గంటకు ఎంత వర్షపాతం



నమోదు అయిందో పర్యవేక్షిస్తున్నాం. సెలవుల్లో ఉన్న అధికారులు కూడా విధుల్లోకి వస్తున్నారు. డ్రోన్స్ కూడా వినియోగిస్తున్నాం.



ఎన్డీయే ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా కురిచేడు మండలం, ఆవులమంద చౌటపాలెం గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణానికి సోమవారం భూమి జరిగింది. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ(టీడీపీ) దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి, యువనేత కడియాల లలిత్ సాగర్, మాజీ శాసన సభ్యుడు నారపుశెట్టి పాపారావు, పార్టీ మండల అధ్యక్షుడు పిడతల నేమిలయ్య, తదితరులు పాల్గొన్నారు.



పెదకూరపాడులో పల్లె పండుగ కార్యక్రమం సోమవారం జరిగింది. ఇందులో భాగంగా 50 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ శంకుస్థాపన చేశారు. అలాగే గ్రామసభలో ఆమోదించిన అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసి, మాట్లాడారు. కలిసికట్టుగా గ్రామాలను అభివృద్ధి చేసుకునేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఆయన కోరారు.



మంగళగిరి పట్టణంలోని ఐహెచ్‌సి భవన్‌లో సోమవారం వ్యవసాయ శాఖ కార్యాలయంలో వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీరావును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సత్కరించిన సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు.




సాయిబాబాకు నివాళులర్పించిన కేటీఆర్...గో బ్యాక్ కేటీఆర్ ... విప్లవోద్యమం వర్ధిల్లాలి అంటూ నినాదాలు



## వచ్చే క్యాబినెట్‌లో ఎలక్ట్రానిక్ పాలసీ

- ఐటీ, ఎలక్ట్రానిక్స్, డ్రోన్ పాలసీలపై చంద్రబాబు సమీక్ష
- అమరావతి డ్రోన్ సమ్మిట్‌పై అధికారులు ముఖ్యమంత్రికి ప్రజెంటేషన్
- డ్రోన్ సమ్మిట్ సందర్భంగా పత్యేక హ్యాకథాన్

**అమరావతి,మహానాడు:**

ఐటీ, ఎలక్ట్రానిక్స్, డ్రోన్ పాలసీలపై ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు సమీక్షించారు. సచివాలయంలో జరిగిన ఈ సమీక్షలో ప్రజెంటేషన్ ద్వారా అధికారులు ప్రభుత్వం తీసుకు వస్తున్న నూతన పాలసీపై ముఖ్యమంత్రికి వివరించారు.

వివిధ రాష్ట్రాల్లో ఉన్న పాలసీలు, ఆయా రంగాల్లో ఉన్న నిపుణులతో చర్చించి కొత్త పాలసీలు రూపొందించినట్లు వివరించారు.

ఎలక్ట్రానిక్స్ పాలసీపై చర్చించిన ముఖ్యమంత్రి సంతృప్తి వ్యక్తం చేశారు. వచ్చే క్యాబినెట్‌లో ఎలక్ట్రానిక్ పాలసీని తీసుకు రావాలని సూచించారు.

అదేవిధంగా ఐటీ పాలసీ, డ్రోన్ పాలసీపైనా ముఖ్యమంత్రి సమీక్షించారు. వీటిని మరింత మెరుగుపరచాలని అధికారులకు సూచించారు. ఈనెల 22, 23వ తేదీల్లో తలపెట్టిన అమరావతి డ్రోన్ సమ్మిట్ పై అధికారులు ముఖ్యమంత్రికి ప్రజెంటేషన్ ఇచ్చారు. కేంద్ర సివిల్ ఏవియేషన్ శాఖ భాగస్వామ్యంతో ఏపి డ్రోన్ కార్పొరేషన్ ఈ సమ్మిట్ ను నిర్వహిస్తోంది. ఈ సమ్మిట్ కు 400 మంది డెలిగేట్స్, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ప్రతినిధులు హాజరవ్వనున్నారు.

విద్యార్థులు, ప్రొఫెషనల్స్, టెక్నాలజీ నిపుణులు కూడా ఈ కార్యక్రమానికి రానున్నారు. డ్రోన్ తయారీ దారులు, వినియోగ దారులు ప్రదర్శనలు ఇవ్వనున్నారు. 5 వేల డ్రోన్లతో ఈ సమ్మట్ లో ప్రత్యేకంగా ప్రదర్శన ఇవ్వనున్నారు. 9 రకాల థీమ్స్ ఈ సమ్మిట్ లో భాగస్వామ్యం చేయనున్నారు.

వ్యవసాయం, గ్రామీణాభివృద్ధి, డిజాస్టర్ మేనేజ్మెంట్, అర్బన్ ప్లానింగ్, ఇన్ఫ్రాస్ట్రక్చర్ మానిటరింగ్, పబ్లిక్ సేఫ్టీ అండ్ లా ఎన్ ఫోర్స్ మెంట్, హెల్త్ కేర్ అండ్ మెడికల్ డెలివరీ, నాచురల్ రిసోర్స్ మేనేజ్మెంట్, సర్వేయింగ్ అండ్ మ్యాపింగ్ ఫర్ ఇంప్రూవ్డ్ గవర్నెన్స్, ట్రాన్స్ పోర్ట్ అండ్ లాజిస్టిక్స్ ఎఫిషియన్సీ, డ్రోన్ అసిస్టెడ్ కంప్యూటర్ విజన్ వంటి అంశాలను సమ్మట్ లో ప్రదర్శించనున్నారు.

డ్రోన్ సమ్మిట్ సందర్భంగా పత్యేక హ్యాకథాన్ నిర్వహించ నున్నారు. దీనికి ఇప్పటికే ఆన్‌లైన్ విధానంలో రిజిస్ట్రేషన్లు స్వీకరిస్తున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 22వ తేదీన ఈ సమ్మిట్ కు హాజరుకానున్నారు.

## 'తూర్పు'లో నూతన క్షిపణి కేంద్రానికి అనుమతి ఆనందమే...

- ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్

**అవనిగడ్డ, మహానాడు:** ఆంధ్రప్రదేశ్ తూర్పు తీరంలో నూతన క్షిపణి కేంద్రం ఏర్పాటుకు కేంద్ర రక్షణ వ్యవహారాల కమిటీ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం ఆనందదాయకమని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. సోమవారం సాయంత్రం అవనిగడ్డలోని తమ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ క్షిపణి పరీక్షలకు అత్యంత అనుకూలమైన ప్రదేశంగా నాగాయలంక



మండలం గుల్లలమోద ప్రాంతాన్ని కేంద్ర ప్రభుత్వం శాటిలైట్ ద్వారా ఎంపిక చేయగా గత ముఖ్యమంత్రి కిరణ్ కుమార్ రెడ్డి హయాంలో భూములు కేటాయించారని తెలిపారు.

చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ప్రహరీ నిర్మించి పర్యావరణ అనుమతులు సాధించారన్నారు. గత ప్రభుత్వంలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్ నాథ్ సింగ్ శంకుస్థాపనకు వస్తారని హెలిపాడ్ సిద్ధం చేసినప్పటికీ గత ప్రభుత్వం సహకారం లేకపోవడంతో పనులు ముందుకు సాగలేదన్నారు. తాజాగా కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వానికి రాష్ట్రంలోని ఎన్డీఏ ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సంపూర్ణ సహకారాలు అందించడంతో ఈ క్షిపణి కేంద్రం సాకారం అయినట్లు తెలిపారు. నాటి డీఆర్డీవో చైర్మన్ డాక్టర్ సతీష్ రెడ్డి ఈ క్షిపణి కేంద్రం మంజూరు నాటి నుంచి నేటి వరకు తన సంపూర్ణ సహాయ సహకారాలు అందించారన్నారు.







## 'దర్శి' అభివృద్ధికి రూ.15 కోట్లు మంజూరు

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి

**దర్శి, మహానాడు:**

ప్రతి పల్లె ప్రగతి వైపు పరుగులు తీసేందుకు కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా సన్నాహాలు చేసిందని, ఇందులో భాగంగానే మౌలిక సదుపాయాల కల్పన నిమిత్తం దర్శి నియోజక వర్గానికి రూ.15 కోట్లు మంజూరు చేసిందని, తెలుగుదేశం పార్టీ(టీడీపీ) నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి వెల్లడించారు. కురిచేడు మండలం, పడమరి వీరయపాలెం గ్రామంలో సోమవారం పల్లె పండుగ - ప్రగతికి అండగా కార్యక్రమంలో లక్ష్మి పాల్గొని, మాట్లాడారు. ప్రభుత్వం నాలుగు నెలల పాలనలో పల్లెల ప్రగతికి పెద్దపీట వేస్తోందని, ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో భారతదేశం అభివృద్ధి పథంలో దూసుకుపోతోందని, దేశాభివృద్ధికి పల్లెల అభివృద్ధి ముఖ్యమని భావించి కేంద్రం నిధులు మంజూరు చేసిందని చెప్పారు.

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ నాయకత్వం, కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రంలో అభివృద్ధి దిశగా పరుగులు పెడుతోందని తెలిపారు. తుపాన్లు, వరదలతో రోడ్లన్నీ గుంతల మయమయ్యాయి... గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం గ్రామాల్లోని రోడ్లను, ప్రధాన రోడ్లను పట్టించుకోలేదని ఆమె విమర్శించారు.

ఈ తరుణంలో పల్లె పండుగ కార్యక్రమం ద్వారా గ్రామాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం కంకణం కట్టుకుందని తెలిపారు. ప్రతి గ్రామానికి 10 లక్షల రూపాయలను మంజూరు చేసింది. దర్శి నియోజకవర్గంలో దాదాపు 15 కోట్ల రూపాయల నిధులను ప్రభుత్వం మంజూరు చేసిందని, సిమెంట్ రోడ్లు, డ్రైన్‌ల నిర్మాణానికి అధిక ప్రాధాన్యతనిస్తూ, పల్లెల్లో ప్రజలకు ఉపాధి అందించే నిమిత్తం ఉపాధి పనులు కూడా కల్పిస్తూ ప్రభుత్వం ప్రజా ప్రభుత్వంగా ముందుకు వెళుతోందన్నారు.

జిల్లా మంత్రులు డోలా బాలవీరాంజనేయ స్వామి, గొట్టిపాటి రవికుమార్, ఎంపీ మాగుంట శ్రీనివాసుల రెడ్డి సహకారంతో దర్శి ప్రాంతంలోని ప్రతి పల్లెను అభివృద్ధి చేసుకుందాం... దర్శి ప్రాంతాన్ని అభివృద్ధి చేయడమే నా లక్ష్యమని మీకు మళ్ళీ చెప్తున్నానని ఆమె పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో కురిచేడు ఎంపీడీవో, పంచాయతీ రాజ్ డీఈ, పార్టీ మండల అధ్యక్షుడు పిడతల నేమిలయ్య, తదితరులు ఉన్నారు. అలాగే, కురిచేడు టౌన్‌లో సీసీ రోడ్ల నిర్మాణానికి గొట్టిపాటి లక్ష్మి భూమి పూజ చేశారు.

మాజీ శాసన సభ్యుడు నారపుశెట్టి పాపారావు, తదితరులు పాల్గొన్నారు.

## 'మద్యం' టెండర్లలో పారదర్శకత ఏది?

- ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి

**విజయవాడ, మహానాడు:**




ప్రభుత్వ పనుల్లో రాజకీయ జోక్యం వద్దని చెప్పిన చంద్రబాబు మద్యం సిండికేట్లను అరికట్టడంలో రాజకీయ చోద్యం చూస్తున్నారని ఏపీసీసీ చీఫ్ వైఎస్ షర్మిలా రెడ్డి విమర్శించారు. ఈ మేరకు ఆమె మీడియాతో ఏమన్నారంటే.. ఎక్కడికక్కడే అధికార పార్టీ నాయకులు కుమ్మక్కై సిండికేట్లుగా ఏర్పడి మద్యం షాపులను దక్కించుకున్నా రని తెలిసింది. కూటమి సిండికేట్లకే 3 వేలకు పైగా మెజారిటీ షాపులు దక్కా యంటే.. మీ పారదర్శకత, నిస్పాక్షికత ఎంత గొప్పగా ఉందో అర్థం అవుతోంది. మీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీల కనుసన్నల్లోనే టెండర్ల ప్రక్రియ సాగింది.

సాధారణ ప్రజలకు షాపులు దక్కకుండా రాష్ట్ర వ్యాప్తంగా బెదిరింపులకు పాల్పడ్డారు. ప్రాణాలు పోతాయని హెచ్చరికలు చేశారు. కూటమి నేతలకు కాదని పొరపాటున ఎవరికైనా లాటరీ చిక్కితే, లైసెన్స్ ఇస్తారా? లేక 30 శాతం కమీషన్ ఇస్తారా? లేకుంటే చస్తారా? అంటూ బెదిరించారు. మమ్మల్ని కాదని మద్యం ఎలా అమ్ముతారో చూస్తాం అంటూ బహిరంగంగానే సవాళ్లకు పాల్పడ్డారు. సీఎం గారు! ఏసీ రూముల్లో కూర్చుని హెచ్చరికలు జారీ చేస్తే సరిపోతుందా? చర్యలు ఏవి? గత వైసీపీ only cash అని గుడిని మింగేస్తే ఇప్పుడు మీరు లింగాన్ని మింగేస్తున్నారు. ప్రైవేటు పేరుతో తక్కువ ధర అని చెప్పి, మద్యం ఏరులై పారించి, వేల కోట్లు దోపిడీకి కూటమి సర్కార్ తెరలేపింది. అందుకేనేమో మీ పాపాల చిట్టాలు రేపు బయటపడకుండా ఉండటం కోసం, పాత సర్కారు మద్యం స్కాంలోని పాపాలపుట్టలు బద్దలుకాకుండా జాగ్రత్త పడుతున్నారు.

## స్వచ్ఛ చల్లపల్లికి హీరో రవితేజ ప్రశంసలు

**చల్లపల్లి,మహానాడు:**



కృష్ణా జిల్లా చల్లపల్లిలో పదేళ్లుగా జరుగుతున్న స్వచ్ఛ కార్యక్రమాలను ప్రముఖ సినిమా హీరో రవితేజ అభినందించారు.సోమవారం ఆయన స్వచ్ఛ చల్లపల్లి కార్యక్రమాలను అభినందిస్తూ వీడియో సందేశాన్ని పంపించారు.

స్వచ్ఛ సుందర చల్లపల్లి కన్వీనర్లు డాక్టర్ డీ.ఆర్.కే. ప్రసాద్-డాక్టర్ టీ. పద్మావతి ఆధ్వర్యంలో దేశం, రాష్ట్రం గర్వించే విధంగా స్వచ్ఛ చల్లపల్లి కార్యక్రమాలు నిర్వహించడం మంచి విషయం అని అన్నారు.







## అనకాపల్లిలో అభివృద్ధిని పరుగులు పెట్టిస్తాం

- మోడల్ నియోజకవర్గంగా అనకాపల్లి
- ఎంపి సీఎం రమేష్ హామీ
- కశింకోట గ్రామంలో 2.24 కోట్ల రూపాయలు సీసీ రోడ్ల పనులకు భూమిపూజ చేసిన అనకాపల్లి పార్లమెంటు సభ్యులు సీ.ఎం రమేష్

**అనకాపల్లి,మహానాడు:**



కశింకోట గ్రామంలో అగ్రహారం వీధి నందు పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా అనకాపల్లి పార్లమెంటు సభ్యులు సీఎం రమేష్ రెండు కోట్ల 24 లక్షల రూపా యలు సీసీ రోడ్లు పనులకు కూటమి నాయకులు మరియు ప్రభుత్వ అధికారులతో కలసి భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రమేష్ మాట్లాడుతూ కసింకోట గ్రామంలో మూడు కోట్ల 88 లక్షల రూపాయల వరకు అభివృద్ధి కార్యక్రమాల కొరకు కేటాయించడం జరిగిం దన్నారు. దానిలో భాగంగా అగ్రహారం వీధి నందు రెండు కోట్ల రూపాయల పైచిలుకు సీసీ రోడ్ల పనులకు ముందుగా శ్రీకారం చుట్టడం శుభ సూచకం అన్నారు.

కూటమి ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చెప్పట్టబోతున్న 'పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవాలు' అక్టోబర్ 14వ తేదీ నుంచి 20వ తేదీవరకు జరుగుతాయి అని రాష్ట్రవ్యాప్తంగా 4,500 కోట్ల నిధులతో చేపట్టబోతున్న 30,000 పనులుకు శ్రీకారం చుట్టడం కూటమి విజయం అని వచ్చే 5 యేళ్లు రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించడమే ప్రామాణికం అని తెలిపారు.

ఆగస్టు 23న తీసుకున్న నిర్ణయాలను ఈరోజు శంకుస్థాపన చేసి సంక్రాంతి లోపు పూర్తిచేయడానికి అధికార యంత్రాంగం సహకారనికి, ముఖ్యంగా ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌కి ప్రత్యేక ధన్యవాదములు తెలియజేసారు అదే విధంగా గత ప్రభుత్వంలో జగన్ మోహన్ రెడ్డి దోచుకోవడానికి మొదటి ప్రాధాన్యత ఇచ్చారు అని దాదాపు అభివృద్ధికి వెచ్చించాల్సిన 3000 కోట్ల రూపాయలు నిధులను దారి మళ్లించారు అని దుయ్యబట్టరు. కశింకోట గ్రామం ఎన్నికల సమయంలో 4500 పై చిలుకు మెజారిటీ ఇచ్చినందుకు ధన్యవాదములు తెలియజేస్తూ గ్రామానికి కావాల్సిన అన్నీ అభివృద్ధి కార్యక్రమలను పూర్తి చేసే బాధ్యత తీసుకుంటానున్నారు.గ్రామానికి సురక్షిత మంచినీటి ప్లాంట్లను ఎన్ని అవసరం ఐతే అన్నీ పూర్తి స్థాయిలో ఏర్పాటు చేస్తాము అని హామీ ఇచ్చారు.

అదేవిధంగా గ్రామానికి కళ్యాణ మండపం తప్పకుండా పూర్తి చేసేందుకు కృషి చేస్తామని, ప్రభుత్వ నిధులు సమకురకపోయిన పరిశ్రమల సిఎస్ఆర్ నిధుల సహకారంతో అయిన పూర్తి చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తుందని తెలియజేశారు. అనంతరం గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో అర్బన్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పీల గోవింద్ ,హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ బత్తుల తాతయ్య బాబు , మాజీ ఎమ్మెల్సీ బుద్ధ జగదీష్ ,బిజెపి జిల్లా అధ్యక్షులు ద్వారపురెడ్డి పరమేశ్వర రావు, గ్రామ సర్పంచ్ జయ రంజని, కూటమి నాయకులు, ప్రభుత్వ అధికారులు డ్వామా పిడి పూర్ణిమ దేవి , మండల ప్రత్యేక అధికారి రోజా రాణి, ఎంపీడీవో రవికుమార్ , ఎమ్మార్వో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || మంగళవారం 15, అక్టోబర్ 2024 ||







## పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవాలు

# ఘనంగా ప్రారంభం




- రాష్ట్రవ్యాప్తంగా రూ. 4,500 కోట్లతో 30 వేల పనులు
- 8 లక్షల కుటుంబాలకు 'ఉపాధి'
- 3 వేల కిలోమీటర్ల రోడ్ల నిర్మాణం, 25 వేల గోకులాలు
- 10 వేల ఎకరాల్లో నీటి సంరక్షణ కందకాలు
- కంకిపాడులో శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ శంకుస్థాపన



**మచిలీపట్నం, మహానాడు:**

పల్లె పండుగ - పంచాయతీ వారోత్సవాలను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కల్యాణ్ కృష్ణాజిల్లా కంకిపాడు గ్రామంలో లాంఛనంగా ప్రారంభించారు. ఇందులో భాగంగా ఉపాధి హామీ నిధులతో రాష్ట్ర వ్యాప్తంగా 4,500 కోట్ల రూపాయల వ్యయంతో 30 వేల పనులు, 8 లక్షల కుటుంబాలకు ఉపాధి హామీ వంద రోజుల పని దినాలు, 3 వేల కిలోమీటర్ల సీసీ రోడ్ల నిర్మాణం, 25 వేల గోకులాల నిర్మాణం, 10 వేల ఎకరాల్లో నీటి సంరక్షణ కందకాలు తవ్వకం పనులకు సంబంధించిన శిలాఫలకాన్ని ఉప ముఖ్యమంత్రి ఆవిష్కరించారు.

అలాగే కంకిపాడు గ్రామపంచాయతీలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద 95.15 లక్షల రూపాయల అంచనా వ్యయంతో 11 అంతర్గత సిమెంటు రహదారులు, రెండు మినీ గోకులాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పునాదిపాడు గ్రామ పంచాయతీలో 52 లక్షల రూపాయల అంచనా వ్యయంతో 2 అంతర్గత రహదారుల నిర్మాణానికి పవన్ కల్యాణ్ శంకుస్థాపన చేశారు. ఈ గ్రామంలో 54 లక్షల రూపాయల అంచనా వ్యయంతో సామాజిక ఆరోగ్య కేంద్రం ప్రహరీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

ఈ కార్యక్రమంలో రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, మచిలీపట్నం పార్ల మెంటు సభ్యుడు వల్లభనేని బాలశౌరి, రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి శశి భూషణ్ కుమార్, సంచాలకులు కృష్ణ తేజ, జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ, జిల్లా పోలీస్ అధికారి ఆర్.గంగాధర్ రావు, పెనమలూరు, గుడివాడ, పామర్రు, పెడన శాసన సభ్యుడు బోడె ప్రసాద్, వెనిగండ్ల రాము, వర్ల కుమార్ రాజా, కాగిత కృష్ణ ప్రసాద్ పలువురు జిల్లా అధికారులు, కంకిపాడు ఎంపీపీ నెరసు రాజలక్ష్మి, సర్పంచు బాకి రమణ, పునాదిపాడు సర్పంచ్ ఎం.విజయకుమారి, బండి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.
















జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || మంగళవారం 15, అక్టోబర్ 2024 ||




# ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తులు

- అందుబాటులోకి 108 కొత్త ఇసుక రీచ్‌లు
- నదుల్లో ఉద్ధృతి దృష్ట్యా తొలివిడత వినియోగంలోకి 40 ఇసుక రీచ్‌లు
- నదీ తీర ప్రాంతాల్లో కొత్త ఇసుక రీచ్‌ల గుర్తింపు
- మంత్రి కొల్లు రవీంద్ర



**విజయవాడ, మహానాడు:**

గత ప్రభుత్వ తప్పిదాల వల్లే ప్రస్తుతం ఇసుక లభ్యత సంక్లిష్టమైందని మంత్రి కొల్లురవీంద్ర విమర్శించారు. ఇసుకపై జగన్ వ్యాఖ్యలు దెయ్యాలు వేదాలు వల్లించడమేనని ఎద్దేవా చేశారు. గత ప్రభుత్వంలో ఇసుక అందుబాటు వివరాలు ఎప్పుడైనా ప్రకటించారా? అని ప్రశ్నించారు.

రాష్ట్రంలో ఇసుక విధానంపై ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర ఏపీఎండీసీ కార్యాలయంలో సోమవారం మీడియా సమావేశం నిర్వహించారు. ఈనెల 16 నుంచి 108 ఇసుక రీచ్‌లు తెరవాలని నిర్ణయించామని తెలిపారు. నదుల్లో ఉద్ధృతి దృష్ట్యా తొలివిడత వినియోగంలోకి 40 ఇసుక రీచ్‌లు తీసుకొస్తామన్నారు. పట్టా భూముల్లో ఉన్న ఇసుక కూడా అందుబాటులోకి తెస్తామని మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు.

జిల్లా కమిటీలు నిర్ణయించిన ధరకు పట్టా భూముల్లోని ఇసుక పొందవచ్చన్నారు. నదీ తీర ప్రాంతాల్లో కొత్త ఇసుక రీచ్‌లు ఉంటే గుర్తింపు ఇస్తామన్నారు. అలాగే కొత్త ఇసుక రీచ్‌లపై కేబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. 1-2 నెలల్లో రాష్ట్రమంతటా ఉచిత ఇసుక విధానం తీసుకొస్తామని స్పష్టం చేశారు.

నిబంధనలు ఉల్లంఘించి ఇసుక విక్రయాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే నిబంధనలు ఉల్లంఘించిన 40 వాహనాలు జప్తు చేసినట్లు గుర్తుచేశారు. ఇసుక కోసం ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేయవచ్చని తెలిపారు.

ఇసుక రీచ్‌ల నుంచి ట్రాక్టర్ల ద్వారా ఇసుక పొందవచ్చన్నారు. రోబో శాండ్‌పై త్వరలో విధానం రూపొందిస్తామని మంత్రి తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చాక ఇసుక నిల్వలన్నింటిని ప్రభుత్వం అధీనంలోకి తీసుకున్నామని వెల్లడించారు. ప్రభుత్వం వచ్చే నాటికి రాష్ట్రంలో అందుబాటులో 35 లక్షల టన్నుల ఇసుక ఉందన్నారు.

ఇప్పటి వరకు 30 లక్షల టన్నుల ఇసుక వినియోగదారులకు అందించామన్నారు. ప్రస్తుతం ఇసుక తవ్వకం, వెలికితీత, ర్యాంప్ నిర్మాణం, సీనరేజ్ పన్ను మాత్రమే వసూలు చేస్తున్నామని తెలిపారు. అదేవిధంగా మద్యం దుకాణాల ద్వారా రూ.30 వేల కోట్లు ఆదాయం అంచనా వేసినట్లు తెలిపారు. గత ప్రభుత్వం కంటే 10-15 శాతం అదనపు ఆదాయం అంచనా వేశామన్నారు.

**గత ప్రభుత్వం మద్యం విధానాన్ని భ్రష్టుపట్టించింది**

తయారీ నుంచి విక్రయాల వరకు గత ప్రభుత్వం మద్యం విధానాన్ని ప్రభుత్వ అధీనంలోనే పెట్టుకుందని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. సొంత బ్రాండ్లను ప్రమోట్ చేసుకొని దోపిడీ చేశారని దుయ్యబట్టారు. తాజాగా మద్యం విధానాలపై సబ్‌కమిటీ అధ్యయనం చేసి, తక్కువ ధరకు నాణ్యమైన మద్యం ఇచ్చేలా విధానం రూపొందించిందని అన్నారు. అన్ని మద్యం బ్రాండ్లను ప్రమోట్ చేసుకోవాలని చెప్పారు.

"ప్రభుత్వంపై నమ్మకంతోనే మద్యం దుకాణాల కేటాయింపునకు పెద్ద ఎత్తున దరఖాస్తులు వచ్చాయి. గుడికి, బడికి 100 మీటర్ల పరిధిలో మద్యం దుకాణాలు ఉండకూడదని స్పష్టమైన ఆదేశాలిచ్చాం. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటాం. అవసరమైతే ఆ దుకాణాలను మూసివేయిస్తాం. గత ప్రభుత్వంతో పోలిస్తే పోలీస్ వ్యవస్థ పటిష్ఠంగా తయారైంది. బెల్ట్ షాపులు నిర్వహిస్తే తీవ్ర చర్యలుంటాయి" అని కొల్లు రవీంద్ర హెచ్చరించారు. విలేకర్ల సమావేశంలో రాష్ట్ర గనులు, ఆబ్కారీ శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా, గనుల శాఖ కమీషనర్ ప్రవీణ్ కుమార్, అబ్కారీ శాఖ సంచాలకులు నిశాంత్ కుమార్ పాల్గొన్నారు.

# గెలిచిన తర్వాత ఖనిజ సంపదల ప్రత్యక్ష దోపిడీ

- 80 లక్షల టన్నుల ఇసుక నిల్వలు ఏమయ్యాయి?
- రీచ్‌లలో ఇసుక మాయం చేసిన కూటమి నేతలు.
- వైయస్సార్సీపీ మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు.



**తాడేపలి,మహానాడు:**

ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రంలో ఖనిజసంపదల దోపిడీకి మాస్టర్ స్కెచ్ వేశారని మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక ఎమ్మెల్యే నుంచి ముఖ్యమంత్రి స్థాయి వరకు ఇసుక దోపిడీని వ్యవస్థీకృతం చేసి... ప్రత్యక్ష దోపిడీకి దిగారని మండి పడ్డారు.

తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, పద్ధతి ప్రకారం ఎవరికీ అనుమానం రాకుండా కూటమి నేతలు దోపిడీకి పాల్పడుతున్నారని మండిపడ్డారు. ప్రజలంతా దసరా పండుగ సందడిలో ఉంటే ... తెలుగు తమ్ముళ్లు మాత్రం ఇసుక, మద్యం టెండర్ల పండుగలో ఉన్నారని తేల్చి చెప్పారు.

ఎవరూ పాల్గొనే అవకాశం ఇవ్వకుండా.... గుట్టు చప్పుడు కాకుండా కూటమి ప్రభుత్వం ఇసుక రీచ్‌ల టెండర్ల ప్రక్రియను నిర్వహిస్తూ... దోపిడీకి తెరలేపిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంత మందికి టెండర్లలో పాల్గొనేందుకు అవకాశం ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేసారు. కూటమి అధికారంలోకి వస్తే ఉచిత ఇసుక ఇస్తామన్న హామీ ఏమైందని ప్రశ్నించారు.

టన్ను ఇసుక తవ్వాడానికి రూ. 90 నుంచి 120 గా బేస్ ధరగా టెండర్లలో నిర్ణయించి, చాలా జిల్లాల్లో టన్ను ఇసుక ధర రూ. 50 నుంచి రూ. 60కి తవ్వుతామని బిడ్లు దాఖలు చేయడం వెనుకున్న మర్మమేంటని నిలదీశారు. ఇసుక టెండర్లలో అక్రమాలకు ఈ ధరలే నిదర్శనమని చెప్పారు. ఇసుక టెండర్లు దక్కించుకోవడానికి అతి తక్కువ ధరకు కోట్ చేయడం, సామాన్యులు బెదిరించడం, దౌర్జన్యం చేయడం వంటి దుర్మార్గాలకు పాల్పడుతూ తెలుగు తమ్ముళ్ల బరి తెగించారని మండిపడ్డారు.

తూర్పుగోదావరి జిల్లాలో 17 రీచ్ లుకు, 48 గంటల్లో టీడీపీ నేతల నుంచి బిడ్‌లు స్వీకరించి ఖరారు చేసేసారని, అలాగే కర్నూలులో అసలు నోటిఫికేషన్ ఇవ్వకుండానే ఒక్క టెండర్ వస్తే బిడ్ ను ఓకే చేసారని తెలిపారు. వైఎస్సార్, పల్నాడు, తూ. గో , ప.గో, అనంతపురం, కృష్ణా, గుంటూరు, చిత్తూరు, అనకాపల్లి, చితూరు, విశాఖ, పార్వతీపురం మన్యం జిల్లాలో ఇసుక బుకింగ్ లేనే లేదని, తెలుగు తమ్ముళ్లు, బీజేపీ, జనసేన నేతలతో కలసి బ్లాక్ లో అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేసారు.

టన్ను ఇసుక తవ్వాడానికి రూ. 90 నుంచి 120గా బేస్ ధరగా నిర్ణయించగా, చాలా జిల్లాల్లో టన్ను ఇసుక ధర రూ. 50 నుంచి 60 తవ్వుతామని బిడ్లు దాఖలు చేయడం అవినీతి ప్రతిబింబిస్తోందని వెల్లడించారు. వైఎస్సార్, పల్నాడు, తూ.గో, ప.గో, అనంతపురం, కృష్ణ, గుంటూరు, చిత్తూరు, అనకాపల్లి, చితూరు, విశాఖ, పార్వతీపురం మన్యం జిల్లాలో ఇసుక బుకింగ్ లేనే లేదని ఆరోపించారు.

రాష్ట్రంలోని వివిధ రీచుల్లో గత వైసీపీ ప్రభుత్వం స్టాక్ పాయింట్లలో నిల్వ ఉంచిన 80 లక్షల టన్నుల ఇసుకను, నాలుగు నెలల కాలంలో అమ్ముకున్నారని,కూటమి పాలనలో ఇదో అంతర్జాతీయ కుట్ర అని మండిపడ్డారు.

ఇసుకను వంద శాతం ఉచితంగా ఇవ్వాల్సిందేనని, ఇసుక విధానాన్ని తక్షణమే ప్రకటించాలని, ఇసుక టెండర్లను రద్దు చేయాలని సుధాకర్ బాబు డిమాండ్ చేసారు. లేకుంటే ప్రజల పక్షాన పోరాటం చేస్తామని హెచ్చరించారు.

# కేసీఆర్ ఇచ్చినవే ఇచ్చి డబ్బా కొట్టుకున్నారు

- రైతు బంధు లేదు.. బతుకమ్మ చీరెలు లేవు.. రుణ మాఫీ రాలేదు.
- మెదక్ జిల్లా అందోల్‌లో మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అలయ్ బలయ్ కార్యక్రమంలో మాజీ మంత్రి హరీష్ రావు



**అందోల్,**

విజయరామరాజు, అల్లం నవాజ్ రెడ్డి వంటి ముఖ్య నాయకులు కోల్పోవడం బాధగా ఉంది.వారి కుటుంబ సభ్యులను నా ప్రగాఢ సానుభూతి. వారు పార్టీకి ఎంతో చేశారు. వారికి నా నివాళి. అలయ్ బలయ్ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉంది.

తెలంగాణ ఉద్యమంలో ఎంతో స్ఫూర్తిని రేపింది అలయ్ బలయ్. పువ్వులను పూజించే గొప్ప సంస్కృతి తెలంగాణ. ప్రకృతిని పూజించే గొప్ప పండుగ. అన్ని కులాల వారు వచ్చి బతుకమ్మ పంచుకోవవడం, గ్రామం గ్రామం అంతా జమ్మి పెట్టుకుంటూ అలయ్ బలయ్ తీసుకునే గొప్ప సంస్కృతి. కేసీఆర్ పాలనలో ఎలాంటి ఇబ్బందులు ఉండేవి కాదు. సంగారెడ్డి లో కలుషిత నీళ్ళు తాగి ఇద్దరు ప్రాణాలు కోల్పోయారు. మేము మిషన్ భగీరథ ద్వారా సురక్షిత నీళ్ళు ఇస్తే, అది కూడా చేయడం లేదు. రైతు బంధు లేదు, బతుకమ్మ చీరెలు లేవు, రుణ మాఫీ రాలేదు.

డిసెంబర్ 9 పోయింది, పంద్రాగస్టు పోయింది. నిన్న మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. డిసెంబర్ 9కి రుణమాఫీ పూర్తి చేస్తాం అంటున్నాడు. ఏడాది కాలం గడిపారు. ఏడాది లోగా రెండు లక్షల ఉద్యోగాలు అన్నారు. కేసీఆర్ ఇచ్చినవే ఇచ్చి డబ్బా కొట్టుకున్నారు.

మండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి మాట్లాడుతూ... భిన్నత్వంలో ఏకత్వానికి తెలంగాణ రాష్ట్రం నిదర్శనం. అన్ని కులాలు మతాలు ప్రాంతాల ప్రజలు ఇక్కడ సంతోషంగా జీవిస్తున్నారు. పదేళ్లలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా కేసీఆర్ గారి పాలన కొనసాగింది. దేశానికే ఆదర్శంగా నిలిచారు.

# అభివృద్ధి బాటలో పల్లెలు

- ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ




**సత్తెనపల్లి, మహానాడు:**

ఎన్డీయే సర్కారు పాలనలో పల్లెలు అభివృద్ధి బాట పడుతున్నాయని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ అన్నారు.

పల్లె పండుగ- పంచాయతీ వారోత్సవాలు కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. సత్తెనపల్లి రూరల్ మండలం, కట్టావారిపాలెం గ్రామంలో రూ.15 లక్షలు, కంటెపూడి గ్రామంలో రూ.20 లక్షలు, భీమవరం గ్రామంలో రూ.8 లక్షల రూపాయలతో నిర్మించనున్న కాలువలు, రోడ్ల పనులకు సోమవారం శంకుస్థాపన చేసి, మాట్లాడారు. రాష్ట్రంలో అభివృద్ధి పనులకు కూటమి సర్కారు శ్రీకారం చుట్టింది. ఐదేళ్ల పాటు వైసీపీ విధ్వంస పాలన కొనసాగిన తర్వాత, మళ్ళీ మన పల్లెలు అభివృద్ధి బాట పడుతున్నాయి. గ్రామసభల్లో ఆమోదించిన 30 వేల పనులకు సంబంధించిన పనులు నేటి నుంచి ప్రారంభం కానున్నాయని తెలిపారు.

# ఉద్యోగ కల్పనే ప్రభుత్వ ప్రధాన లక్ష్యం!

మొదటి పేజీ తరువాయి..

ఏర్పడుతుందని సీఎం అన్నారు.

దాదాపు 7-8 శాఖల్లో నూతన పాలసీలకు శ్రీకారం చుడుతున్న ప్రభుత్వం....వీటి రూపకల్పనపై మూడు నెలలుగా కొత్త కసరత్తు చేస్తోంది. ముఖ్యమంత్రి సూచనలు, పరిశ్రమ వర్గాల అభిప్రాయాలు, ఉత్తమ ఫలితాలు ఇచ్చిన ఇతర రాష్ట్రాల విధానాల ఆధారంగా అధికారులు పాలసీలు రూపొందించి ముఖ్యమంత్రి ముందు ఉంచారు. వీటిపై సీఎం లోతుగా చర్చించి సమీక్ష నిర్వహించారు. ప్రతి పాలసీ తయారీలో తన అనుభవాలు, ఆలోచనలు పంచుకున్నారు. ఈ సమీక్షలో అధికారులు ఆయా పాలసీలపై ముఖ్యమంత్రికి ప్రజెంటేషన్ ఇచ్చారు. ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ పాలసీ అమల్లోకి వచ్చిన వెంటనే పెట్టుబడులు పెట్టేందుకు వచ్చిన వారికి అదనంగా పారిశ్రామిక ప్రోత్సాహకాలు ఇచ్చేందుకు ప్రతిపాదించనట్టు తెలిపారు. కన్సెంట్ ఆఫ్ ఎస్టాబ్లిష్ మెంట్, డేట్ ఆఫ్ కమర్షియల్ ప్రొడక్షన్ ఇచ్చిన మొదటి 200 కంపెనీలకు అదనపు ప్రోత్సాహకాలు ఇచ్చేలా డ్రాఫ్ట్ పాలసీలో ప్రతిపాదనలు చేశారు.

ఎక్కువ ఉద్యోగాలు కల్పించే కంపెనీలకు అదనంగా 10 శాతం ప్రోత్సాహకం ఇచ్చేలా ఇండస్ట్రియల్ పాలసీ విధానాలను రూపొందించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ....దేశంలో ఎక్కడా లేని విధంగా ఎస్క్రో అకౌంట్ ద్వారా పారిశ్రామిక ప్రోత్సాహకాలు ఇచ్చే అంశంలో ఆలోచనలు చేస్తున్నట్టు తెలిపారు. తద్వారా కంపెనీలకు జాప్యం లేకుండా ఎస్క్రో అకౌంట్ ద్వారా ఇన్సెంటివ్ లు దక్కుతాయని...ఇది పారిశ్రామిక ప్రగతికి, ఉద్యోగ కల్పనకు దోహదం చేస్తుందని సీఎం అభిప్రాయపడ్డారు. త్వరితగతిన ఉపాధి, ఉద్యోగాల కల్పనకు ఇలాంటి కీలక నిర్ణయాలు దోహదం చేస్తాయని....ఈ విషయంలో సాధ్యాసాధ్యాలను, విధివిధానాలను సమగ్రంగా స్టడీ చేసి.....నివేదిక ఇవ్వాలని అధికారులకు ముఖ్యమంత్రి ఆదేశించారు.

ఒక కుటుంబం... ఒక పారిశ్రామిక వేత్త అనే కాన్సెప్ట్ తో ఎంఎస్ఎంఈ పాలసీ ఉండాలని..అది కూటమి ప్రభుత్వ విధానమని చంద్రబాబు అధికారులకు సూచించారు. అదే విధంగా గత క్యాబినెట్ లో ప్రకటించినట్టు అమరావతిలో దివంగత పారిశ్రామిక వేత్త రతన్ టాటా పేరున రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ను ఏర్పాటు చేయనున్నట్లు సీఎం ప్రకటించారు. పారిశ్రామిక రంగ అభివృద్ధికి దోహదపడేలా ప్రత్యేక రతన్ టాటా హబ్ తీసుకురావాలని నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. స్కిల్స్ డెవలప్మెంట్, ఇన్నోవేషన్, స్టార్టప్స్, ఫెసిలిటేషన్ కేంద్రంగా అమరావతిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేయాలని సీఎం అన్నారు. రాష్ట్రంలోని అయిదు ప్రాంతాల్లో హబ్ కు అనుబంధంగా సెంటర్స్ ఏర్పాటు జరుగుతుందని.... ఒక్కో సెంటర్ కు ఒక్కో మల్టీనేషనల్ కంపెనీ మెంటార్‌గా ఉండేలా డిజైన్ చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు.

ఆక్వా, పౌల్ట్రీ రంగంలో వచ్చిన విధంగా ఫుడ్ ప్రాసెసింగ్ లో ఫలితాలు వచ్చే విధానాలను అమలు చేయాలని ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ సూచించారు. పౌల్ట్రీ రంగంతో పాటు పాడి పరిశ్రమ, మేకలు, గొర్రెలు పెంపకానికి ప్రాధాన్యతను ఇవ్వాలని...తద్వారా ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయని అన్నారు. ప్రభుత్వ పాలసీల్లో ఈ అంశాలను చేర్చాలని సీఎస్ సూచించారు. ఎంఎస్ఎంఈ, ఫుడ్ ప్రాసెసింగ్ రంగంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మహిళా వ్యాపారవేత్తలకు అదనంగా 5 శాతం ఇన్సెంటివ్ ఇచ్చేలా ప్రతిపాదించాలని సీఎం సూచించారు. ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్క్స్ పాలసీపైనా అధికారులతో చర్చించారు. అయితే, మరింత కసరత్తు తరువాత క్యాబినెట్ ముందుకు ప్రైవేట్ ఇండస్ట్రియల్ పార్క్ పాలసీని తీసుకురావాలని సీఎం సూచించారు. ఈ సమీక్షలో మంత్రులు టీజీ భరత్, కొండపల్లి శ్రీనివాస్, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పల్లె ప్రగతికి బాటలు వేస్తాం..

- ఎమ్మెల్యే చదలవాడ



**నరసరావుపేట, మహానాడు:**

పల్లెల అభివృద్ధికి అభివృద్ధి బాటలు వేస్తామని నరసరావుపేట ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించిన "పల్లె పండుగ" వారోత్సవాల్లో భాగంగా సోమవారం నరసరావుపేట మండలం రావిపాడు, లింగంగుంట్ల, అల్లూరివారిపాలెం, ఇక్కుర్రు గ్రామాల్లో జడివానలోనే తడుస్తూ ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా హాజరై పలు అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ. 4500 కోట్లతో గ్రామాల అభివృద్ధికి ఈ ప్రభుత్వం బాటలు వేస్తోందని పేర్కొన్నారు.

రాష్ట్ర వ్యాప్తంగా 30వేల పనులకు సుమారు 4500 కోట్లతో అభివృద్ధి పనులుకు శ్రీకారం చుట్టినట్లు తెలిపారు. గత ఐదేళ్ల వైసిపి పాలనలో గ్రామాల్లో ఒక అభివృద్ధి పని జరగలేదని పేర్కొన్నారు. జగన్ పాలనలో పంచాయతీలను నిర్వీర్యం చేశారని ఎద్దేవా చేశారు. టీడీపీ కూటమి ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నాయకత్వంలో రాష్ట్ర ప్రగతికి బాటలు వేశారని తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో రోడ్లు మంచినీరు, పారిశుద్ధ్యం, వీధిలైట్లు ఏర్పాటు చేసి పలు అభివృద్ధి పనులు వేగవంతం చేస్తామని చదలవాడ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో గోనుగుంట్ల కోటేశ్వరరావు, బండారుపల్లి విశ్వేశ్వరరావు, నియోజకవర్గ కూటమి నేతలు, కార్యకర్తలు, మహిళలు, ప్రభుత్వ అధికారులు పాల్గొన్నారు.

# పరిశ్రమల స్థాపనకు ఆంధ్రాలో సూపర్ ఛాన్స్!

మొదటి పేజీ తరువాయి..

సంబంధించి ప్రత్యేకమైన వాట్సాప్ గ్రూప్ ద్వారా ప్రతివారం ఇన్వెస్టర్స్‌కు అప్ డేట్ చేస్తున్నాం. దేశంలోనే తొలిసారిగా స్కిల్‌సెన్సస్ కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. ఇందులో భాగంగా తొలివిడతలో మార్కెట్ డిమాండ్ కు అనుగుణంగా హౌస్ హెూల్డ్ డాటా, ఎడ్యుకేషన్ డేటా మైక్రో లెవల్‌లో సేకరిస్తున్నాం. 5 ఏళ్లలో 20 లక్షల ఉద్యోగాల సాధించాలన్న మా లక్ష్యానికి స్కిల్ సెన్సస్ దోహదపడుతుంది. ప్రధాని మోడీ వికసిత్ భారత్ స్ఫూర్తితో 2047 నాటికి వికసిత్ ఆంధ్రప్రదేశ్ లక్ష్యంగా ముందుకు సాగుతున్నాం. లాంగెస్ట్ కోస్ట్ లైన్ మాకు ఉంది. సంపద సృష్టించడం ద్వారా పేదరికంలో మగ్గుతున్న వర్గాలను పైకి తేవడం మా లక్ష్యం అని లోకేష్ వివరించారు.

**స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ దిశగా ఏపీ**

ఏపీలో వేగవంతమైన పారిశ్రామికాభివృద్ధికి స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ దిశగా ముందుకు సాగుతున్నాం. ఐటి రంగంలో తెలుగు ప్రజల పాత్ర కీలకం. గతంలో చంద్రబాబు పెద్దఎత్తున ఇంజనీరింగ్ కాలేజిలను ఏర్పాటు చేసి ఇంజనీరింగ్ విద్యను ప్రోత్సహించారు. ఆయన కృషి కారణంగా వై2కె బూమ్ సమయంలో హైదరాబాద్ నగరంలో ఐటి అభివృద్ధి చెందింది. మాకు మంచి మ్యాన్ పవర్ ఉంది. విశాఖ నగరాన్ని ఐటి, కెమికల్, ఫార్మా, మెడికల్ డివైస్ కేంద్రంగా తీర్చిదిద్దుతాం. ఏపీలో పరిశ్రమల స్థాపనకు అవసరమైన ఎకోసిస్టమ్ కల్పిస్తున్నాం. అతిపెద్ద తీర ప్రాంతం కలిగిన ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి వికేంద్రీకరణకు ప్రణాళికాబద్ధంగా కృషిచేస్తున్నాం. ప్రాంతాల వారీగా అభివృద్ధికి ఫోకస్ పాయింట్లను నిర్దేశించాం. రెన్యువబుల్ ఎనర్జీ, ఆటోమొబైల్, ఎలక్ట్రానిక్స్, మెడికల్ డివైజ్, పెట్రో కెమికల్, ఫార్మా రంగాలకు పెద్దపీట వేస్తాం. 2029నాటికి 72 గిగావాట్స్ రెన్యువబుల్ ఎనర్జీ ఉత్పత్తి లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని మంత్రి పేర్కొన్నారు.

**స్టార్టప్ ఆంధ్ర నినాదం మాత్రమే కాదు... ఆయుధం!**

నేడు వేగంగా మారుతున్న అధునాతన సాంకేతిక ప్రక్రియలో స్టార్టప్ అంధ్ర అనేది కేవలం నినాదం మాత్రమే కాదని, పరిపాలన విధానాన్ని సమూలంగా మార్చే ఓ అద్భుతమైన ఆయుధంగా ఉపయోగపడుతోందని మంత్రి లోకేష్ పేర్కొన్నారు. అంకురాల ద్వారా సాంకేతికతను ఏకీకృతం చేసి వినూత్న మార్గాలు అన్వేషిస్తున్నట్టు చెప్పారు. గతనెలల్లో ఏపీలో సంభవించిన వరద విపత్తును సమర్థంగా ఎదుర్కొవడంలో అంకుర సంస్థల వినియోగం ఓ నూతన అధ్యాయంగా అభివర్ణించారు. సెప్టెంబర్ మొదటి వారంలో వరద ముంచెత్తినప్పుడు శాఖల మధ్య సమన్వయం, సవాళ్ళను సమర్థంగా ఎదుర్కొనేందుకే అనుసంధాన వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నట్టు చెప్పారు. సహాయక చర్యల కోసం తొలిసారిగా మా ప్రభుత్వం డ్రోన్‌ల వినియోగాన్ని ప్రారంభించింది. విజయవాడలో 40 కిలోల వరకు మోసుకెళ్లగల డ్రోన్‌లను వినియోగించాం. ముంపు ప్రాంతాల్లో సహాయ చర్యలకు ఇవి ఎంతగానో ఉపయోగపడ్డాయి.

**వరదల సమయంలో స్టార్టప్‌ల సేవలు అద్భుతం**

వరద నిర్వహణలో ఎదుర్కొంటున్న సవాళ్లపై శాఖల నుంచి వచ్చే ఫిర్యాదులు ఆధారంగా రియల్ టైమ్ పరిష్కారాల కోసం అంకురాలను ఆహ్వానించామని లోకేష్ తెలిపారు. రికార్డ్ సమయంలో సమస్యలు పరిష్కారానికి స్టార్టప్ ఎకోసిస్టమ్ శక్తి తమకు ఆశ్చర్యం కలిగించిందని అన్నారు. విశాఖకు చెందిన స్టార్టప్ ఫ్లూయంట్ గ్రిడ్ ద్వారా అభివృద్ధి చేసిన యాక్టిలిజెన్స్ అనే ఫ్లడ్ మానిటరింగ్ సిస్టమ్ సహాయక బృందాలు త్వరితగతిన నిర్ణయం తీసుకునేందుకు ఉపయోగపడింది. బాధితులకు బిస్కెట్లు, మ్యాగీ వంటి ఆహార సామగ్రిని అందించడానికి వీలు కల్పించే ఆన్‌లైన్ వ్యవస్థ దీని ద్వారా ఏర్పాటైంది. RINT_SS అనే హైదరాబాద్ ఆధారిత స్టార్టప్ కేవలం 2 రోజుల్లోనే ఫ్లడ్ ఎన్యూమరేషన్ పోర్టల్‌ను అభివృద్ధి చేయడంలో సహాయం చేసింది. దీనిద్వారా బాధితుల గణన త్వరగా చేయటం, కేవలం 15రోజుల్లో పరిహారం బదిలీ చేయడానికి వీలు కల్పించింది. Sat_sure, జియో స్పేషియల్ డేటా అనలిటిక్స్ కంపెనీ వరద ప్రభావిత జోన్‌లలో వరద తీవ్రతను లెక్కించడానికి ఉపయోగపడింది. QoptarsL అనే అంకురసంస్థ డేటాను సేకరించేందుకు, కెమెరాలతో డ్రోన్‌లను మోహరించేందుకు సహాయం అందించింది. దోమలు, అంటు వ్యాధుల వ్యాప్తి జరగకుండా నీరు నిలిచిన ప్రాంతాలను గుర్తించడంతో పాటు అనలిటిక్స్ డ్యాష్‌బోర్డ్‌ను అభివృద్ధి చేయడానికి ఈ సంస్థ దోహదపడిందని మంత్రి లోకేష్ చెప్పారు.

**ట్రిలియన్ డాలర్ ఎకానమీగా తీర్చిదిద్దడమే లక్ష్యం**

నాలుగోసారి ఈ ఏడాది జూన్‌లో చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. ట్రిలియన్ డాలర్ల స్థూల రాష్ట్ర దేశీయోత్పత్తి (జీఎస్‌డీపీ) సాధించిన మొదటి మూడు రాష్ట్రాల్లో ఒకటిగా ఆంధ్రప్రదేశ్ అవతరించాలని లక్ష్యంగా పెట్టుకున్నందున, రాష్ట్రాన్ని ప్రగతిశీల సంస్థగా మార్చేందుకు వచ్చే ఐదేళ్లలో 10 కీలకమైన రంగాలను ప్రభుత్వం గుర్తించింది. పట్టణ, గ్రామీణ అవసరాలను పరిష్కరిస్తూ వివిధ రంగాల్లో సమగ్ర పురోగతి సాధించడానికి కృషిచేస్తున్నాం.

అమరావతి అభివృద్ధి, నదుల అనుసంధానం, మెరుగైన నీటి నిర్వహణ, ప్రజలు-పబ్లిక్-ప్రైవేట్ భాగస్వామ్యాన్ని పెంపొందించడం వంటి అంశాలపై దృష్టి సారించాం. మా ప్రభుత్వం పరిశ్రమలు, టూరిజం, సేవా రంగాలను ప్రోత్సహిస్తోంది, పారిశ్రామిక పార్కులను ఏర్పాటు చేస్తోంది. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ & ఎలక్ట్రానిక్స్, ఫుడ్ ప్రాసెసింగ్, ఆటోమొబైల్, పునరుత్పాదక శక్తి, టెలికమ్యూనికేషన్స్, రసాయన తయారీ సబ్‌సెక్టార్లలో ప్రాధాన్యతలతో కొత్తపారిశ్రామిక విధానాన్ని రూపొందిస్తున్నాం. ఉద్యోగ సృష్టి లక్ష్యంగా విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టబోతున్నాం. ఇందులో ప్రైవేటు రంగం నుంచే ఎక్కువ భాగస్వామ్యం ఉంటుందని చంద్రబాబు ఇప్పటికే ప్రకటించారు. వచ్చే ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్న ఎన్నికల వాగ్దానాన్ని నెరవేర్చేందుకు మా ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి లోకేష్ స్పష్టం చేశారు.

**మొబైల్ ఫోన్ ద్వారా 100 రకాల సేవలు**

అమరావతిని వరల్డ్ క్లాస్ ఏఐ రాజధానిగా తీర్చిదిద్దబోతున్నాం. ఫేజ్ -1లో 100 రకాల ప్రభుత్వ సేవలను ఫోన్ ద్వారా అందించబోతున్నాం. పాలనలో ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్ వినియోగం ద్వారా మెరుగైన సేవలందిస్తాం. డిజిటల్ విధానంలో ప్రజల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకుంటాం. గతంలో చంద్రబాబునాయుడు సైబరాబాద్‌ను అభివృద్ధి చేసి ప్రపంచ పటంలో నిలిపారు. అమరావతిని గ్రీన్ ఫీల్డ్ రాజధానిగా అభివృద్ధి చేయాలని నిర్ణయించాం.

రైతుల భాగస్వామ్యంతో వరల్డ్ క్లాస్ సిటీగా తయారుచేసేందుకే ప్రణాళికలు సిద్ధంచేశాం. ఎస్ఆర్ఎం, విఐటి వంటి సంస్థలు ఇప్పటికే ఆ ప్రాంతంలో తమ కార్యకలాపాలను కొనసాగిస్తున్నాయి. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ఏపీ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా 92శాతం స్ట్రయిక్ రేటుతో 175కు 164స్థానాల్లో విజయం సాధించాం. ఇందులో 88 మంది ఎమ్మెల్యేలు, 17 మంది మంత్రులు కొత్తవారు ఉన్నారు. ఏపీ ప్రజలు ఆశలు, ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాల్సిన బాధ్యత మాపై ఉంది.


జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ న్యూస్ పేపర్ || మంగళవారం 15, అక్టోబర్ 2024








## 'నాగబంధం'-అక్టోబర్ 23 నుంచి రెగ్యులర్ షూటింగ్

పాన్ ఇండియా స్థాయిలో సినిమాలు నిర్మించే పాషనేట్ ఫిల్మ్ మేకర్ అభిషేక్ నామా, డెవిల్: ది బ్రిటిష్ సీక్రెట్ ఏజెంట్‌తో దర్శకుడిగా సక్సెస్ ఫుల్ డెబ్యు చేసిన తర్వాత, తన అప్ కమింగ్ డైరెక్షనల్ వెంచర్ 'నాగబంధం- ది సీక్రెట్ ట్రెజర్' ప్రాజెక్ట్ ని అనౌన్స్ చేశారు. అభిషేక్ నామా కథ, స్క్రీన్ ప్లే కూడా అందిస్తున్నారు. అభిషేక్ పిక్చర్స్‌తో కలిసి ఎన్ఐకె స్టూడియోస్ ప్రొడక్షన్ నంబర్1గా కిషోర్ అన్నపురెడ్డి ఈ మ్యాజిస్టిక్ ఎడ్వెంచర్‌ని నిర్మించనున్నారు. తారక్ సినిమాస్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రానికి లక్ష్మీ ఐరా, దేవాన్ష్ నామా సమర్పిస్తున్నారు. 'పెదకాపు' సినిమాతో సక్సెస్ ఫుల్‌గా డెబ్యు చేసిన విరాట్ కర్ణ, తన పవర్ ప్యాక్డ్ యాక్షన్ పెర్ఫార్మెన్స్ తో అందరి ప్రశంసలు అందుకున్నాడు. 'నాగబంధం' చిత్రంలో విరాట్ కర్ణ లీడ్ రోల్ పోషిస్తున్నారు. ఇందులో నభా నటేష్, ఐశ్వర్య మీనన్ ఫిమేల్ లీడ్స్‌గా నటిస్తున్నారు.

జగపతి బాబు, జయప్రకాష్, మురళీ శర్మ, బి.ఎస్. అవినాష్ ముఖ్యమైన పాత్రల్లో కనిపించనున్నారు. భారీ అంచనాలున్న ఈ చిత్రం టీం, ప్రత్యేక అతిథుల సమక్షంలో ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన మెగాస్టార్ చిరంజీవి ముహూర్తం షాట్‌కి క్లాప్ కొట్టారు.

## 'సూర్య 45' అనౌన్స్‌మెంట్

జోకర్, అరువి, ధీరన్ అధిగారం ఒంద్రు, ఖైదీ, సుల్తాన్, ఒకే ఒక జీవితం, ఫర్హానా వంటి బ్లాక్‌బస్టర్‌లను రూపొందించిన ప్రముఖ నిర్మాణ సంస్థ డ్రీమ్ వారియర్ పిక్చర్స్, తమ బిగ్గెస్ట్ మూవీ 'సూర్య 45'ని పూజా కార్యక్రమంతో ప్రారంభించింది. ఎస్ఆర్ ప్రకాష్‌బాబు, ఎస్ఆర్ ప్రభు నిర్మించనున్న ఈ చిత్రం ప్రొడక్షన్ హౌస్ యొక్క మోస్ట్ ఎక్స్ పెన్సీవ్ మూవీ. మూకుతి అమ్మన్, వీట్ల విశేషం వంటి హిలేరియస్, సోషల్ రెస్పాన్సబులిటీ కలిగిన చిత్రాలకు దర్శకత్వం వహించిన ఆర్జే బాలాజీ ఈ భారీ యాక్షన్ అడ్వెంచర్ చిత్రానికి దర్శకత్వం వహించనున్నారు. ఆర్.జె. బాలాజీ ప్రస్తుతం సూర్య 45 ప్రీ-ప్రొడక్షన్‌లో బిజీగా ఉన్నారు. ఈ ఎక్సయిటింగ్ స్క్రిప్ట్‌పై ఒక సంవత్సరానికి పైగా పని చేస్తున్న ఆయన, ఈ పక్కా ఎంటర్‌టైనర్ కోసం లొకేషన్‌లను ఖరారు చేయడానికి రెక్కీ కోసం అనేక ప్రదేశాలను సందర్శిస్తున్నారు.



## 31న ప్రేక్షకుల ముందుకు "క"

యంగ్ టాలెంటెడ్ హీరో కిరణ్ అబ్బవరం నటిస్తున్న భారీ పీరియాడిక్ థ్రిల్లర్ సినిమా "క". ఈ సినిమాలో నయన్ సారిక, తన్వీ రామ్ హీరోయిన్స్‌గా నటిస్తున్నారు. శ్రీమతి చింతా వరలక్ష్మి సమర్పణలో శ్రీచక్రాస్ ఎంటర్ టైన్ మెంట్స్‌తో బ్యానర్ పై చింతా గోపాలకృష్ణ రెడ్డి భారీ ప్రొడక్షన్ వ్యాల్యూస్‌తో నిర్మిస్తున్నారు. దర్శక ద్వయం సుజీత్, సందీప్ విలేజ్ బ్యాక్ డ్రాప్ యాక్షన్ థ్రిల్లర్ కథతో "క" సినిమాను రూపొందిస్తున్నారు.

ఈ సినిమా దీపావళి పండుగ సందర్భంగా ఈ నెల 31న తెలుగుతో పాటు తమిళ, మలయాళ, కన్నడలో గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. "క" సినిమాను తెలుగులో ప్రొడ్యూసర్ వంశీ నందిపాటి, మలయాళంలో హీరో దుల్కర్ సల్మాన్ తన వేఫరర్ ఫిలింస్ పై రిలీజ్ చేయబోతున్నారు. "క" సినిమా రిలీజ్ డేట్ అనౌన్స్ మెంట్ ప్రెస్ మీట్ హైదరాబాద్ ప్రసాద్ ల్యాబ్స్ లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హీరో కిరణ్ అబ్బవరం మాట్లాడుతూ – "క" సినిమాను ఈ నెల 31న దీపావళి పండుగ సందర్భంగా రిలీజ్ చేయాలని నిర్ణయించాం.


ఆ రోజు చాలా సినిమాలు రిలీజ్ కు వస్తున్నాయి. థియేటర్స్ దగ్గర పోటీ ఉంది. మేము ఈ నెల 31న రిలీజ్ చేయడానికి కారణం మా వంశీ నందిపాటి. ఆయన మూవీ చూసి మంచి ప్రైస్ ఇచ్చి సినిమా రిలీజ్ చేస్తున్నారు.

## డిసెంబర్ 20న 'సారంగపాణి జాతకం'

మోహనకృష్ణ ఇంద్రగంటి దర్శకత్వంలో శ్రీదేవి మూవీస్ పతాకంపై ఆ సంస్థ అధినేత శివలెంక కృష్ణ ప్రసాద్ నిర్మిస్తున్న సినిమా 'సారంగపాణి జాతకం'. ఇందులో ప్రియదర్శి సరసన తెలుగమ్మాయి రూప కొడువాయూర్ కథానాయికగా నటించారు. 'జెంటిల్‌మన్', 'సమ్మోహనం' వంటి




విజయవంతమైన సినిమాల తర్వాత మోహనకృష్ణ ఇంద్రగంటి, శివలెంక కృష్ణప్రసాద్ కలయికలో రూపొందుతున్న హ్యాట్రిక్ చిత్రమిది. ఈ సినిమా విడుదల తేదీని నేడు వెల్లడించారు. చిత్ర నిర్మాత శివలెంక కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ... "డిసెంబర్ 20న మా సినిమాను ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయబోతున్నాం. సెప్టెంబర్ మొదటి వారంలో చిత్రీకరణ అంతా పూర్తి చేశాం. ప్రస్తుతం డబ్బింగ్ కార్యక్రమాలు సైతం తుది దశకు చేరుకున్నాయి. అతి త్వరలో ఫస్ట్ కాపీ రెడీ అవుతుంది. సెన్సార్ కార్యక్రమాలు సైతం పూర్తి చేసి క్రిస్మస్ సెలవుల్లో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకు వస్తాం. ఇటీవల కొన్ని సన్నివేశాలు, ఫుల్ రష్ చూశా. నాకు ఎంతో సంతృప్తి కలిగింది. మనిషి భవిష్యత్తు అతని చేతి రేఖల్లో ఉంటుందా? లేదా అతను చేసే చేతల్లో ఉంటుందా? అనే ప్రశ్నకు జవాబు ఇచ్చే ఓ పరిపూర్ణ హాస్యరస చిత్రం మా 'సారంగపాణి జాతకం' అని చెప్పారు.



## మహేష్‌బాబు దర్శకత్వంలో రామ్ పోతినేని

'ఉస్తాద్' రామ్ పోతినేని హీరోగా అగ్ర నిర్మాణ సంస్థ మైత్రి మూవీ మేకర్స్ నిర్మించనున్న చిత్రానికి రంగం సిద్ధమైంది. తెలుగు, తమిళ, మలయాళ, హిందీ భాషల్లో అగ్ర హీరోలతో పాన్ ఇండియా స్థాయిలో సినిమాలు నిర్మిస్తున్న 'మైత్రి' సంస్థ రామ్ పోతినేనితో ఫస్ట్ ఎటెంప్ట్.గా ఓ ఇంట్రస్టింగ్ ప్రాజెక్టు చేస్తోంది. నవీన్ పోలిశెట్టితో 'మిస్ శెట్టి మిస్టర్ పోలిశెట్టి' సినిమా డైరెక్ట్ చేసి, ఘన విజయం అందుకున్నదర్శకుడు మహేష్‌బాబు దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందనుంది. విజయదశమి సందర్భంగా ఈ చిత్రాన్ని అధికారికంగా ప్రకటించారు. హీరోగా రామ్ పోతినేనికి ఇది 22వ చిత్రం. నవంబర్ నుంచి చిత్రీకరణ మొదలుపెడతామని, రామ్ పోతినేనితో సినిమా చేయడం చాలా ఆనందంగా వుందని, హై ఎనర్జీతో న్యూ ఏజ్ స్టోరీ టెల్లింగ్‌తో ఈ చిత్రం వుంటుందని నిర్మాతలు నవీన్ యెర్నేని, వై.రవిశంకర్ తెలిపారు. కథానాయిక, ఇతర తారాగణం, సాంకేతిక బృందం వివరాలు త్వరలోనే ప్రకటించనున్నారు.



## 'మట్కా' నుంచి మెమరబుల్ రెట్రో సాంగ్

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ మోస్ట్ ఎవైటెడ్ మూవీ 'మట్కా' రిలీజ్ కు రెడీగా వుంది. పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. వైర ఎంటర్‌టైన్‌మెంట్స్, ఎస్ఆర్‌టి ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై డాక్టర్ విజయేందర్ రెడ్డి తీగల, రజనీ తాళ్లూరి నిర్మిస్తున్న ఈ చిత్రానికి కరుణ కుమార్ దర్శకత్వం వహిస్తున్నారు.

ఈ చిత్రానికి సంబంధించిన ప్రచార కార్యక్రమాలు కూడా జోరందుకున్నాయి. మేకర్స్ ఫస్ట్ సింగిల్ లే లే రాజా విడుదల చేసి మ్యూజిక్ ప్రమోషన్స్ ని కిక్ స్టార్ట్ చేశారు. జివి ప్రకాష్ కుమార్ మెమరబుల్ రెట్రో పాటను స్కోర్ చేసారు. 70, 80ల స్టైల్‌లోని కంపోజిషన్ థంపింగ్ బీట్‌లతో అద్భుతంగా ఉంది. భాస్కరభట్ల సాహిత్యం రెట్రో అనుభూతిని కలిగిస్తుంది, నీతి మోహన్ వోకల్స్ కట్టిపడేశాయి. ఈ పాటలో వరుణ్ తేజ్ డిఫరెంట్ గెటప్‌లలో ఆకట్టుకున్నారు. కలర్‌ఫుల్ పబ్ బ్యాక్‌డ్రాప్‌లో చిత్రీకరించిన పాటలో నోరా ఫతేహి రెట్రో లుక్‌లో అలరించింది.

## నవంబర్ 22న 'మెకానిక్ రాకీ' థియేట్రికల్ రిలీజ్

మాస్ కా దాస్ విశ్వక్ సేన్ మోస్ట్ ఎవైటెడ్ మాస్ యాక్షన్, కామెడీ ఎంటర్‌టైనర్ 'మెకానిక్ రాకీ'తో అలరించడానికి రెడీగా వున్నారు. ఈ హైలీ యాంటిసిపేటెడ్ మూవీ ఇంట్రస్టింగ్ టీజర్‌తో చాలా క్యూరియాసిటీని క్రియేట్ చేసింది. మొదటి రెండు పాటలకు కూడా అద్భుతమైన స్పందన వచ్చింది. రవితేజ ముళ్లపూడి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని రామ్ తాళ్లూరి ఎస్ఆర్‌టి ఎంటర్‌టైన్‌మెంట్స్‌పై నిర్మిస్తున్నారు. సినిమా విడుదల తేదీకి సంబంధించిన అప్‌డేట్ ఇచ్చారు మేకర్స్. మెకానిక్ రాకీ నవంబర్ 22న థియేటర్లలోకి రానుంది. రిలీజ్ డేట్ పోస్టర్‌లో విశ్వక్ సేన్ ఇంటెన్స్ ఎక్స్‌ప్రెషన్‌తో కనిపించారు. మీనాక్షి సాంప్రదాయ చీరలో, శ్రద్ధా మోడరన్ అవుట్ ఫిట్ లో ఆకట్టుకున్నారు. మెకానిక్ రాకీ ట్రైలర్‌ను ఈ నెల 20న విడుదల చేయనున్నట్లు పోస్టర్ లో తెలియజేశారు మేకర్స్.



Published by **Bodepudi Venkata Subbarao Managing Director** on behalf of Mahanadu Media pvt ltd. **Editor: Marthi Subrahmanyam** Phone: 9705311144

డిజిటల్ న్యూస్ పేపర్
మంగళవారం 15, అక్టోబర్ 2024

జనం గుండె చప్పుడు

# మహానాడు

www.mahanaadu.com

డిజిటల్ మీడియాలో ..

# జయహో "మహానాడు"

# 2,03,132

## ఈ-పేపర్ పాఠకులకు సగర్వంగా సవినయంగా సెల్యూట్



మార్చి 1న ప్రారంభమైన మన
మహానాడు ప్రస్థానంలో కలిసి నడుస్తున్న
మా అభిమాన పాఠకుల
అనుబంధానికి వందనం





సీనియర్ జర్నలిస్ట్
మార్తి సుబ్రమణ్యం
సంపాదక సారథ్యంలో





బోడేపూడి సుబ్బారావు (BSR)
సారథ్యంలో

